అగ్రనేత
తెలుగు దిన పత్రిక
TELTEL/2015/66279
రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :199 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 09-10-2024 | పేజీలు:4 వెల: 2.00

## జమ్మూ కశ్మీర్‌లో మెహబూబా ముఫ్తీ కూతురు ఓటమి..

జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. శ్రీగుఫ్వారా - బిజ్‌బెహరా నియోజకవర్గం నుంచి పోటీ చేసిన పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి, జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కూతురు ఇల్తిజా ముఫ్తీ ఓటమి పాలయ్యారు. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అభ్యర్థి బషీర్ అహ్మద్ చేతిలో ఓటమి చవిచూశారు. ఈ మేరకు తన ఓటమిని ఇల్తిజా అంగీకరించారు. ప్రజా తీర్పును గౌరవిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు. తన గెలుపు కోసం కష్టపడిన పీడీపీ కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.కాగా, జమ్మూ కశ్మీర్‌లో కాంగ్రెస్ కూటమి హవా కొనసాగిస్తోంది. మ్యాజిక్ ఫిగర్‌ను దాటి అత్యధిక స్థానాల్లో ముందంజలో ఉంది. మొత్తం 90 స్థానాలకు గానూ నేషనల్ కాన్ఫరెన్స్ - కాంగ్రెస్ కూటమి 52 స్థానాలతో ఆధిక్యంలో దూసుకెళ్తోంది. బీజేపీ 26 స్థానాల్లో ముందంజలో ఉంది. పీడీపీ నాలుగు స్థానాల్లో, ఇతరులు ఎనిమిది స్థానాల్లో ముందంజలో ఉన్నారు.

# ఎంబీబీఎస్ సీట్లు రావడం చరిత్రలో ఇదే తొలిసారి..



హైదరాబాద్: వైద్య విద్యకు తెలంగాణను కేరాఫ్ అడ్రస్‌గా చేసిన ఘనత కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి దక్కుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు (హరీష్ రావు) అన్నారు. నీట్‌లో 3 లక్షలకు పైగా ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు కూడా కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు రావడం సంతోషించదగ్గ విషయమని చెప్పారు. బీసీ ఏ కేటగిరిలో 3.35 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి, ఎస్సీ కేటగిరీలో 3.11 లక్షల ర్యాంకు, ఎస్టీ కేటగిరీలో 2.89 లక్షల ర్యాంకు, బీసీ బీలో 2.27 లక్షలు, బీసీ సీలో 3.14 లక్షలు, బీసీ డీలో 2.13 లక్షలు, బీసీ ఈసీల్లో 2.24 లక్షల ర్యాంకుల చరిత్ర . కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.మారుమూల ప్రాంతాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని చేరువ చేయడం, తెలంగాణ బిడ్డలు డాక్టర్ కావాలనే కలను స్వరాష్ట్రంలోనే ఉండి సుసాధ్యం చేసుకోవాలని జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని కేసీఆర్ ఏర్పాటు చేశారన్నారు. గత పదేండ్ల కాలంలో రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య 5 నుంచి 34కు పెరిగాయని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేటు కలిపి మొత్తం మెడికల్ కాలేజీల సంఖ్య 20 నుంచి 60కి చేరాయి. ఈ రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 2850 నుంచి 8315లకు పెరిగిందని, ఎంబీబీఎస్‌కు అవకాశాలు పెరిగే అవకాశం ఉంది."కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు. మూడు లక్షలకు పైగా ర్యాంకులు వచ్చిన తెలంగాణ విద్యార్థులకు కూడా కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు రావడం సంతోషించదగ్గ విషయం. బీసీ-ఏ కేటగిరిలో 3.35 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి, ఎస్సీ కేటగిరీలో 3.11 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి, ఎస్టీ కేటగిరిలో 2.89 లక్షల ర్యాంకు, బీసీ-బిలో 2.27 లక్షలు, బీసీ-సీలో 3.14 లక్షలు, బీసీ-డిలో 2.13 లక్షలు, బీసీ-24లో లక్షల సంఖ్యలో ర్యాంకులు సాధించిన వారికి ఎంబీబీఎస్ సీట్లు రావడం చరిత్రలో ఇదే మొదటిసారి.మారుమూల ప్రాంతాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని చేరువ చేయడం, తెలంగాణ బిడ్డలు డాక్టర్ కావాలనే కలను స్వరాష్ట్రంలోనే వుండి కేసీఆర్ సుసాధ్యం చేసుకోవాలని జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. కేసీఆర్ పాలనలో గడిచిన పదేళ్ల కాలంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య 5 నుంచి 34కు పెరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు కలిపి మొత్తం మెడికల్ కాలేజీల సంఖ్య 20 నుంచి 60కి చేరాయి.వైద్య విద్యకు తెలంగాణను కేరాఫ్ అడ్రస్ గా చేసిన ఘనత కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి దక్కుతుంది. దీనితో తెలంగాణలో ఎంబీఎస్ సీట్ల సంఖ్య 2850 నుంచి 8315లకు పెరిగి, ఎంబీబీఎస్‌కు అవకాశాలు పెరిగాయి. వైద్య విద్య కోసం చైనా, ఉక్రెయిన్, రష్యా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. రాష్ట్రంలో పెరిగిన మెడికల్ సీట్లను విద్యార్థులు అందుకోవాలని, తెలంగాణాలో ఉండి వైద్య విద్య చదివి దేశానికి సేవ చేయాలని కోరుకుంటున్నాను." అంటూ హరీశ్ రావు ట్వీట్ చేశారు.

# తెలంగాణ ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయం..

హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం కమిటీ ఏర్పాటు చేసింది. గల్ఫ్‌లో కార్మికులు చనిపోతే వారి కుటుంబానికి 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనుంది ప్రభుత్వం. ప్రవాసి ప్రజావాణి పేరుతో ఫిర్యాదులను స్వీకరించనుంది. గురుకులాల్లో గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.ఎండమావులు దాహం తీర్చలేవు.. ఎడారి దేశంలో పనికిపోతే అప్పులు తీరవు.. దీపానికి అట్రాక్ట్ అయ్యే పురుగుల్లా.. గల్ఫ్ దేశాలకు ఎగిరిపోయి.. అక్కడే పిట్టల్లా రాలిపోతున్నారు. అప్పులు తీర్చలేక.. పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబాలు పడే ఆవేదన వినే వారే కరువయ్యారు. స్థానికంగా ఉపాధి కల్పించని ప్రభుత్వాలు కనీసం పొరుగు దేశం నుంచి వారి శవాలను కూడా రప్పించ లేకపోతున్నాయి. మోడు వారిని జీవితాల్లో ఏ రేడు వెలుగులు నింపుతాడోనని కళ్లలో వత్తులేసుకుంటున్నారు బాధితులు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గల్ఫ్ దేశాల్లో పనిచేస్తూ దురదృష్ట వశాత్తూ మరణించిన తెలంగాణ ప్రవాసీ కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. దీనికి సంబంధించి జీవో నెంబర్ 216 ద్వారా అధికారిక ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి.

కార్మిక సంక్షేమానికి తొలి అడుగు:

తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటిసారిగా గల్ఫ్ ప్రాంతాల్లో పనిచేస్తున్న వలస కార్మికుల సంక్షేమం కోసం ఈ విధమైన ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం గమనార్హం. ఈ నిర్ణయం లక్షల మంది గల్ఫ్ కార్మికులకు ఉపయోగపడనుంది.

ఎవరికి వర్తిస్తుంది..?:



ఈ ఎక్స్‌గ్రేషియా బహ్రెయిన్, కువైట్, ఒమాన్, ఖతార్, సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి 7 గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్న తెలంగాణ వలస కార్మికులకు వర్తిస్తుంది. 2023 డిసెంబర్ 7 లేదా ఆ తర్వాత చనిపోయిన గల్ఫ్ కార్మికులకు ఇది అమలులోకి వస్తుంది. మరణానికి కారణం ఏదైనా ఈ పరిహారం వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది, అంటే సహజ మరణం, ప్రమాదం, అనారోగ్యం, లేదా ఏదైనా ప్రమాదకర పరిస్థితుల్లో మరణించిన వారికి ఇది వర్తిస్తుంది.

పరిహారం కోసం దరఖాస్తు విధానం:

ఈ ఎక్స్‌గ్రేషియా కోసం గల్ఫ్ ప్రాంతాల్లో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులు అంటే జీవిత భాగస్వామి, పిల్లలు లేదా తల్లిదండ్రులు తమ స్థానిక జిల్లా కలెక్టర్‌కి దరఖాస్తు చేసుకోవాలి. మరణం జరిగిన తేదీ లేదా మృతదేహం స్వీకరించిన తేదీ నుంచి 6 నెలలలోపు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

# ఈడీ విచారణకు కాంగ్రెస్ నేత అజారుద్దీన్

హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వరింగ్ ప్రెసిడెంట్, హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు, భారత క్రికెట్ మాజీ కెప్టెన్ మహమ్మద్ అజరుద్దీన్ (అజారుద్దీన్) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణకు ఫిర్యాదు చేశారు. హెచ్‌సీఏలో రూ.20 కోట్ల మోసం వ్యవహారంలో ఇటీవల ఆయనకు ఈడీ నోటీసులు జారీచేసింది. దీంతో మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంస్థ విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా అజహర్ మాట్లాడుతూ.. తనపై వచ్చినవి తప్పుడు ఆరోపణలని చెప్పారు.2019 నుంచి 2023 వరకు హెచ్‌సీఏలో జరిగిన అక్రమాలపై ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో పలు ఫిర్యాదులు ఉన్నాయి. వీటికి తోడు ఉప్పల్ స్టేడియంలో హెచ్‌సీఏ అక్రమాలపై ఏసీబీ అధికారులు పలు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. వీటి ఆధారంగా ఈడీ అధికారులు ఈసీఆర్ నమోదు చేశారు. అజారుద్దీన్ పదవీకాలంలో క్రికెట్ బాల్స్, బకెట్ చైర్స్, జిమ్ పరికరాలకు కొనుగోళ్లలో భారీగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలోనే హెచ్‌సీఏలో అక్రమాలపై ఈడీ నజర్ పెట్టింది. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయిలో హెచ్‌సీఏలోని అక్రమాలపై విచారణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. కాగా ఇదే కేసులో మాజీ క్రికెటర్లు అర్షద్ అయూబ్, శివలాల్ యాదవ్‌ను గత డిసెంబర్‌లో ఈడీ అధికారులు విచారించారు.

గతంలోనూ విచారణ..

ఇదే రూ.20 కోట్ల అంశానికి సంబంధించి హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు,



బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌కు ఈడీ అధికారులు గత డిసెంబర్‌లో నోటీసులు జారీ చేశారు. ఈ ఏడాది జనవరి మొదటి వారంలో ఈడీ ఎదుట హాజరుకావాలని వినోద్‌కు నోటీసులు పంపి, విచారించారు. ఉప్పల్ రోడ్డు నిర్మాణాల వ్యవహారంలో అక్రమాలకు నిధులు స్వాహా చేసినట్లు, అవినీతి నిరోధక శాఖ మూడు కేసులు నమోదు చేసింది. ఈ కేసుల ఆధారంగా మనీ లాండరింగ్ చట్టం కింద మరో కేసును నమోదు చేసిన ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఇదే వ్యవహారంలో గత నవంబర్‌లో తెలంగాణ వ్యాప్తంగా 9 చోట్ల సోదాలు నిర్వహించబడ్డాయి. ఈ సోదాల్లో డాక్యుమెంట్లు, డిజిటల్ పరికరాలు, రూ.10,39,000 నగదును ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# టీడీపీ నేత బుద్దా వెంకన్న సంచలన వ్యాఖ్యలు



విజయవాడ:బుడమేరు వరదలను అడ్డం పెట్టుకుని వందల కోట్లు వెనకేసుకు న్నారని ఏపీ సీఎం చంద్రబాబు, ప్రభుత్వ నేతలపై వైసీపీ చేస్తున్న విమర్శలపై టీడీపీ నేత బుద్దా వెంకన్న ఘాటుగా స్పందించారు. వరదలను అడ్డం పెట్టుకుని దోపిడీ చేశారు అనడానికి సిగ్గు ఉండాలని. అబద్ధాలు ప్రచారం చేసే అడ్రస్ లేకుండా వెళ్లారని.. ఇప్పుడు మళ్లీ అలాగే చేస్తే వైసీపీ భూ స్థాపితం కావడం ఖాయమని.వరదల సమయంలో బాధితులను ఏపీ సీఎం చంద్రబాబు ఆదుకున్న తీరు దేశానికే ఆదర్శమని టీడీపీ నేత బుద్దా వెంకన్న కొనియాడారు. చంద్రబాబు వల్లే ఈ వరదల నుంచి సురక్షితంగా బయటపడ్డామని ప్రజలు చెబుతుంటే.. వైసీపీ నేతలు భరించలేకపోతున్నారని. అవినీతికి ఆస్కారం లేకుండా కూటమి ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టిందని స్పష్టం చేశారు. దమ్ముంటే అవినీతి ఆరోపణలపై బహిరంగ చర్చకు రావాలని వైసీపీ నాయకులకు సవాలు విసిరారు.ప్రజల వరదల్లో అల్లాడిపోతే ఏసీ గదిలో కూర్చున్న వ్యక్తి మాజీ సీఎం వైఎస్ జగన్ అని బుద్దా వెంకన్న అన్నారు. ఏనాడైనా బురదలో అడుగుపెట్టి ప్రజలను కలిశావా? నువ్వా పేద ప్రజల గురించి మాట్లాడేదని. వరద బాధితుల కోసం కోటి రూపాయలు ప్రకటించిన వైఎస్ జగన్.. ఎవరికి ఎంత ఖర్చు పెట్టారని ప్రశ్నించారు. సిగ్గు శరం లేకుండా అసత్యాలు ప్రచారం చేస్తావా అని ఉంది. ప్రజా ధనాన్ని దోచుకున్న జగన్ కూడా నీతులు వల్లిస్తున్నారంటూ ఎద్దేవాచేశారు. రాష్ట్రాన్ని నాశనం చేయాలనే వైసీపీ నేతల కుట్రలను తిప్పి కొడతామని. ప్రజలకు సేవ చేయడం అలవాటు చేసుకో.. కుట్ర కుళ్లు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

# ఏం బాధపడకండి.. ఆ రోడ్డు తెరిపించే బాధ్యత నాదే..



హైదరాబాద్: విజయవాడ జాతీయ రహదారిపైన ఉన్న ట్రాఫిక్‌ను అదిగమించే ందుకు పోచంపల్లి- మన్సూరాబాద్ వరకు ఉన్న పాత రోడ్డు తెరిపించే బాధ్యత నాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆయన మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి క్రీడా అధికారులు శ్రీ సాయినగర్‌కాలనీ వద్ద మూసివేసిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గతంలో ఉన్న పాత రోడ్డు మ్యాపును ఈటలకు చూపించారు.రోడ్డును మూసి వేయడం వల్ల కలుగుతున్న ఇబ్బందులను, ట్రాఫిక్ సమస్యలను ఎంపీకి వివరించారు. దాదాపు వంద సంవత్సరాలుగా ఉన్న రోడ్డును కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రిడా) ఏర్పాటుతో అధికారులు రోడ్డుకు అడ్డంగా గోడను కట్టి మూసివేశారని తెలిపారు. ప్రజలకు కలుగుతున్న అసౌకర్యంపై దాదాపు 30 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని నర్సింహారెడ్డి ఎంపీకి వివరించారు. అయినా అధికారులు స్పందించడం లేదని అన్నారు.ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. నగరానికి దూరాన్ని తగ్గించేదిగా ఉన్న మన్సూరాబాద్- పోచంపల్లి రోడ్డును కేంద్ర ప్రభుత్వంతో చర్చించి తెరిపించడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నా రు. ఈ రోడ్డును తెరిపించడం వల్ల విజయవాడ జాతీయ రహదారిపైన ట్రాఫిక్ తగ్గుతుందన్నారు. ఫోన్‌లో ఫారెస్టు అధికారులతో మాట్లాడారు. పాత రోడ్డును వదిలి రోడ్డుకు ఇరువైపుల గోడ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మాజీ కౌన్సిలర్ రవీందర్‌రెడ్డితో పాటు పలువురు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి వైపు అడుగులు వేయాలి..

దిల్‌సుఖ్‌నగర్: కాలనీవాసులంతా ఐక్యమత్యంతో సమస్యలపై పోరాటం చేసినప్పుడే కాలనీలు త్వరగా అభివృద్ధి చెందుతాయని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని పీ అండ్ టీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కాలనీ 50 ఏళ్ల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ చెరువు లోతట్టున ఉన్నటువంటి పీ అండ్ టీ కాలనీ తరచు ఇబ్బందులు పడుతున్న వరదనీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చొరవచూపుతానని హామీనిచ్చారు.రాజ్యసభసభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ అన్ని ప్రాంతాల ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారుల కలయికతో ఏర్పడిన పీ అండ్ టీ కాలనీ యాభై వసంతాల వేడుక జరుపుకోవడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ అధికారి సుభద్రదేవి, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బండి నిర్మల, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మున్నంగి అశోక్ కుమార్, వేణుగోపాల్, మున్నాయాదవ్ పాల్గొన్నారు.

## వినేష్ పొగాట్ ఘన విజయం

హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. జులానా స్థానం నుంచి పోటీ చేసిన భారత స్టార్ రెజ్లర్, కాంగ్రెస్ అభ్యర్థి వినేష్ ఫొగాట్ విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి యోగేష్ కుమార్‌పై వినేష్ గెలుపొందారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి వీరిద్దరి మధ్య హోరాహోరీ పోటీ కొనసాగింది. ఒకానొక సమయంలో వినేష్ ఫొగాట్ వెనుకంజలోకి వెళ్లిపోయారు.

# నాడు అయోధ్యలో నేడు కశ్మీర్‌లో మోదీనే పడగొట్టిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,వ్రతం చెడినా ఫలితం దక్కలేదన్న సామెత ఇప్పుడు బీజేపీకి సరిగ్గా సరిపోతుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో, ఇవాళ జమ్మూకశ్మీర్ ఎలక్షన్స్ ఫలితాలు చూస్తే ఇదే స్పష్టం అవుతుంది. 500 ఏళ్ల హిందువుల కల అయోధ్య రామ మందిర నిర్మాణం చేపట్టినా, ఆర్టికల్ 370 రద్దు చేసినా బీజేపీకి చేదు ఫలితం ఎదురైంది.

మొన్న రామ మందిరం షాక్

రామ మందిరాన్ని కట్టించి హిందువుల చిరకాల కోరికను నిజం చేసి చూపించారు ప్రధాని మోదీ. అవాంతరాలు, అడ్డంకులు..కోర్టు కేసులు..వివాదాలు అన్నీ ఒక్కొటిగా దాటుకుని భవ్యరామ మందిరం నిర్మాణం పూర్తి చేశారు. రాముడి ప్రతిష్ఠ జరిపారు. దేశమంతా హ్యాపీ అనుకున్నారు. ఇది చూసిన హిందువులు, బీజేపీ ఇంకా హ్యాపీ. రాముడికి ఇన్నాళ్లకు ఓ నీడ దొరికిందని సంతోష పడ్డారు. రామ మందిరం నిర్మాణం పూర్తి చేశామన్న ఉత్సాహంతో లోక్ సభ ఎన్నికలకు దిగిన బీజేపీకి ఊహించని షాక్ తగిలింది. అయోధ్య అసెంబ్లీ ఉన్న ఫైజాబాద్ లోక్ సభ నియోజకవర్గాన్ని ఇండీ కూటమిలోని సమాజ్ వాదీ పార్టీ గెలుచుకుంది. అంటే ఇన్నేళ్ల కలను తీర్చిన అయోధ్య ప్రజలు చుట్టుపక్కల నియోజకవర్గాల వాళ్లు బీజేపీని తిరస్కరించారని అర్థం. ఇది ఊహించని షాక్ బీజేపీకి అని చెప్పవచ్చు.

నేడు జమ్మూలో షాక్

తాజాగా రెండో షాక్ తగిలింది. ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్ ను పూర్తిగా భారత్ చట్టాల పరిధిలోకి తీసుకువచ్చింది బీజేపీ ప్రభుత్వం. దీని కోసం ఎన్నో ఏళ్లుగా వ్యూహం పన్నింది. అస్సలు బీజేపీ ఐడియాలజీకి సరిపోని మెహబూబా ముఫ్తీతో పొత్తు పెట్టుకుని గెలిచింది. తర్వాత మద్దతు ఉపసంహరించుకుని మోదీ, అమిత్ షా రాజకీయ చాణక్యాన్ని ప్రదర్శించారు. రాజకీయ వ్యూహాలతో కశ్మీర్ లోని పార్టీలను ఉక్కిరి బిక్కిరి చేసి వేర్పాటువాద శక్తులు సైతం బిత్తరపోయేలా ఆర్టికల్ 370 రద్దు చేశారు. ఫలితంగా కశ్మీర్ రాష్ట్రం హోదా కోల్పోయి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడిపోయింది. జమ్ము కశ్మీర్ , లద్దాఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలు కొత్త ప్రయాణం మొదలు పెట్టాయి. తర్వాత తొలిసారిగా అక్కడ ఎన్నికలు జరిగాయి. జనరల్‌గా పాకిస్థాన్ కబంధ హస్తాల్లోనూ..వేర్పాటు వాద శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్న కశ్మీర్ ను పూర్తిగా మన చేతుల్లోకి తెచ్చుకునేలా..పాక్ ఆక్రమిత కశ్మీర్ కూడా మాదే అని పార్లమెంటులో గర్జించిన అమిత్ షా కామెంట్స్ కు దేశభక్తి తో ఉప్పొంగిపోయిన ప్రజలు బీజేపీకి పట్టం కట్టాలి కదా. అందుకే ఈసారి పీడీపీతో కూడా పనిలేకుండా సింగిల్‌గా బరిలోకి దిగింది. కానీ ఈరోజు



వచ్చిన రిజల్ట్ బీజేపీకి షాక్ ఇచ్చింది. అబ్దుల్లాల పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్ తో జత కట్టిన కాంగ్రెస్ కశ్మీర్ లో హవా చూపించింది.

రాహుల్ గాంధీ అప్పర్ హ్యాండ్

ఈక్వేషన్ సింపుల్. ఫైట్ ఏదైనా కానీ ప్రధాన ప్రత్యర్థులు ఎవరనేదే చూస్తారు. మన దేశంలో జాతీయ స్థాయిలో రెండే ప్రధాన అధికార కేంద్రాలు. ఒకటి



మను సాయి, శ్లోక,తేజశ్రీ సత్య శివ నాగరాజు, నాగమణి .ఇండియా లోనే అతి పెద్ద దాండియా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికీ మిస్ ఇండియా ఆసియా పసిఫిక్ సుధా జైన్ గారు ముఖ్య అతిథి గా విచ్చేసి ప్రేక్షకులను తన ఆటలతో ఉర్రూత లూగించారుఇలాంటి దాండియా కార్యక్రమలు దాదాపు పది వేల మంది మధ్యలో జరుపు కోవటం చాలా సంతోషంగా ఉందనీ సుధ జైన్ తెలిపావు. కార్యక్రమానికి ముఖ్య అతిథి గా తనను ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉందనీ news9 ఈనాడు చైర్మన్ చలపతి రాజు గారికి కృతజ్ఞతలు తెలియజేసారు.

## సంపాదకీయం

బుధవారం 09-10-2024

# జస్ట్ ఆస్కింగ్!


'సమాజంలో కులం– సమాజాంతరాల్లో కులం/ కులంలో కులం– మతంలో కులం/ గుడిలో కులం– బడిలో కులం/ పెళ్లిలో కులం– ప్రేమలో కులం' అంటారు కవి శంబూక. 'జైళ్లలోనూ కులం – ఖైదీలకు చెప్పే పనుల్లోనూ కులం' వుందన్న విషయాన్ని 'జై భీమ్' సినిమాలో కళ్లకు కట్టినట్లు చూపిస్తే, నిజ జీవితంలో వేళ్లూనుకొని వున్న కుల వివక్ష జైళ్లలోనూ వుందని, ఆ వివక్షకు ముగింపు పలకాలని, కులం ఆధారంగా పనిని వేరు చేసి కేటాయించే పద్ధతులను విడనాడాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానిం చడం%ొ%మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయమైంది. మనకున్న కులం భాష– సంస్కృతం. దానికి మరో పేరు దేవభాష. 19వ శతాబ్దం వరకూ శూద్ర, పంచములకి చెందిన ఎవ్వరూ ఈ దేవభాషను నేర్చుకోరాదనే పైశాచిక అంశాలుండేవి. మనకున్న కులం ఫిలాసఫీ– బ్రాహ్మణ మతం. దానికి మరో పేరు వేదాంతం. మనకున్న కులచట్టం– మనుధర్మ శాస్త్రం. ఇది వేల ఏళ్లుగా మన భౌతిక, మానసిక జీవితాన్ని నిర్దాక్షిణ్యంగా శాసిస్తూ వచ్చింది. భారతదేశం నా మాతృభూమి– భారతీయులంతా నా సహోదరులన్న సోదరభావాన్నిఈ కులమతాల సంస్కృతి విషపూరితం చేసింది. తరతరాల మానవ మేధస్సుకు మేకులు కొట్టిన ఈ సంస్కృతి, దేశ ప్రజల ప్రగతికి శిలువ వేసింది. 'నేను పుట్టక ముందే/ దేశద్రోహుల జాబితాలో/ నమోదైంది నా పేరు' అంటారు ఖాదర్ మొహియుద్దీన్. అలాగే..పుట్టుకతో పడిన కుల వివక్ష ముద్ర%ొ% పుట్టుమచ్చలా మరణం వరకూ వెంటాడుతోంది. కుల వ్యవస్థను అసహ్యించుకుంటున్నట్లు నటిస్తూ, అభ్యుదయం గురించి కోతలు కోస్తూ, అంతర్నాటకమాడే ప్రబుద్ధులు నేడు అవతరించారు. జాతి నరనరాన్ని నమిలివేస్తున్న కులతత్వాన్ని తిరిగి పునరుద్ధరించాలనే మతోన్మాద భావజాలాన్ని సనాతన ధర్మం అంటూ భుజానికెత్తుకోవడం అంటే%ొ% ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను నిరంకుశంగా అణగదొక్కడం కాదా? సనాతన ధర్మం, హిందూ సంస్కృతి వంటి అర్థం తెలియని పదాలను వల్లెవేస్తారేగాని, ఆ ధర్మాల లోతుగాని, మతం ఎత్తిన అవతారాలుగాని తెలుసుకోరు. 'మానుతున్న గాయాన్ని మళ్లీ ఎవరో కెలికారు/ ఎవరో స్వేచ్ఛను యాభై ఏళ్లలోపే పరీక్షకు నిలబెట్టారు' అంటారు కవి యాకూబ్. 'భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, దేశ సమగ్రతను కాపాడుతానని, పక్షపాతం లేకుండా ప్రజలందరికీ న్యాయం చేస్తా'నని ప్రమాణం చేసిన వ్యక్తి, ఇప్పుడు తానొక మత ప్రతినిధిగా, సనాతన ధర్మ పరిరక్షకునిగా ప్రకటించుకోవడం చేసిన ప్రమాణాన్ని ఉల్లంఘించడం కాదా? రాజ్యాంగబద్ధంగా ప్రజలిచ్చిన పదవిని అవమానించడం కాదా? సనాతన ధర్మానికి ప్రాతిపదిక– కులం. సనాతన ధర్మాన్ని ప్రబోధించే ధర్మశాస్త్రాల్లో శూద్ర– పంచములపై అమలుజేయబడ్డ నిషేధాలు– సాంఘిక కిరాతకత్వానికి చిహ్నాలు కాదా? సనాతన ధర్మాన్ని ప్రబోధించడం అంటే కులవ్యవస్థను ప్రోత్సహించడం కాదా? సనాతన ధర్మం అంటే–దళితులు, గిరిజనులపై తరతరాలుగా పెరిగిపోతున్న అంటరానితనం, కుల వివక్ష, మహిళలపై సాగుతున్న అణచివేతకు దన్నుగా నిలవడం కాదా? 'జస్ట్ ఆస్కింగ్%ొ%' అంటున్నారు ప్రజలు. గుర్రం జాషువా ఒకసభలో గొంతెత్తి పద్యం చదివితే, అదే సభలో వున్న 'కవి సామ్రాట్' బిరుదాంకితుడైన ఒకాయన 'జాషువా గారు పంచమ స్వరంలో చదివిన పద్యం ఆ పాత మధురంగా వుంది' అన్నాడట. జాషువా పంచముడనే విషయాన్ని సభలో కూడా ఎత్తిపొడవడమే ఆయన ఉద్దేశం.. అంటూ 'ఆధునిక యుగంలో కుల వ్యవస్థ' అనే పుస్తకంలో పేర్కొన్నాడు సీవీ. లౌకికతత్వాన్ని గౌరవించాల్సిన ఒక మంత్రి%ొ%'సూడో సెక్యులరిజం' అంటూ చులకనగా మాట్లాడటం, ఒక మతతత్వ ప్రతినిధిలా ఇతర మతాలను తూలనాడే విధంగా వ్యాఖ్యానించడం చూస్తే కులాన్ని దూషించిన ఆ కవి సామ్రాట్‌కి, లౌకికతత్వ విలువలకు, నైతికతకు వలువలూడ్చిన ఈ నట సనాతన వాదికి తేడాలేదు. 'కులం పునాదుల మీద ఒక జాతిని నిర్మించలేదు. ఒక నీతిని నిర్మించలేదు' అంటారు అంబేద్కర్. ప్రతి భారతీయుడి నరనరాన జీర్ణించుకొని వున్న లౌకికతత్వాన్ని నిర్జించి, ఏ విలువల నిర్మాణం కోసం సనాతన ధర్మ రక్షణ చట్టం తేవాలని అంటున్నారో సదరు మంత్రిగారు చెప్తారా?

# మోడీ తిరోగమన నిర్ణయాలు !



న్యూఢిల్లీ,దేశంలో తిరోగమన రాజకీయాలను మోడీ పట్టించుకోవడం లేదు. మోడీ గురివింద సామెతలా..తన తప్పులను పక్కన పెట్టి ఎదుటి పక్షాలను విమర్శిస్తూ పోతున్నారు. బిజెపి అధికారంలోకి వచ్చి పదేళ్లు దాటినా పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. ప్రజలను విడిచి పాలన సాగిస్తున్న ఏకైక పార్టీకి మోడీ నాయకత్వం వహిస్తున్నారు. అయితే తమకుతాము బ్రహ్మాండంగా పనిచేస్తున్నామని, మంచి పాలన అందిస్తున్నామని చంకలు గుద్దుకుంటున్నారు. ధరల పెరుగుదుల, రూపాయి విలువ పడిపోవడం, పెట్రో ధరలు పెరగడం, బంగారం ధరలు పెరగడం, సిమెంట్ ధరలు పెరగడం, కూరగాయల ధరలు పెరగడం, నిత్యాసవర ధరలు పెరగడం, ఇళ్ల నిర్మాణాలు అందుబాటులో లేకపోవడం వంటివన్నీ మోడీ సాధించిన విజయాలుగా చెప్పుకోవాలి. ఇవన్నీ మరచి తెలంగాణలో రుణమాఫీ కాలేదని ఆరోపణలు చేయడం దారుణం కాక మరోటి కాదు. కరోనాలో లక్షల మంది చనిపోతే పట్టించుకోని దౌర్భాగ్యం చూశాం. చనిపో యిన కుటుంబాల లెక్కలను తక్కువ చేసిన వైనం చూశాం. మోడీ నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగం పెరుగు తోంది. పరిశ్రమలు మూతపడుతున్నాయి. ఉన్న పరిశ్రమలను తెగనమ్ముతున్నారు. రూపాయి విలువ పడి పోవడంతో అంతర్జాతీయంగా మారకం ధరలు పెరిగాయి. వంటనూనెల ధరలు పెరుగుతున్నా పట్టించు కోవడం లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సమ్యలే తప్ప పరిష్కార మార్గాలు కనపించడం లేదు. అందుకే మోడీ పట్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది. ఏదో చేస్తార్న భ్రమలు తొలగిపోతున్నాయి. పదేళ్లలో చేయలేని వారు మరో ఐదేళ్లలో చేస్తారన్న ఆశలు లేవు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతోంది. జిఎస్టీ భారం అంతా ఇంతా అని చెప్పడానికి లేదు. కాబూలీవాలా లాగా నెలకు ఎంత జిఎస్టీ వసూళ్లు పెరిగాయన్న లెక్కలు చూసుకుని మురిసి పోతున్నారు. జిఎస్టీ భారం తలకు మించి కావడంతో దానిని కట్టకుండా ఎగవేద్దామన్న ధోరణిలో వ్యాపారాలు సాగుతున్నాయి. అందుకే ఏదైనా వస్తువుతు కొనుగోలు చేస్తే జిఎస్టీతోనా...లేకుండానా అని వ్యాపారులు అడుగుతున్నారు. దీనిని గుర్తించకుండా గుడ్డిగా జిఎస్టీ అమలు చేస్తున్న తీరు ఆక్షేపణీయం. అందుకే మోడీ ఏకపక్ష నిర్ణయాలు, నిరంకుశ విధానాల కారనంగా ప్రజలు ప్రత్యమ్నాయం గురించి ఆలోచన చేస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ మళ్లీ పుంజుకుంటోంది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి 240 సీట్లు మాత్రమే ఇవ్వడం వెనక ప్రజల్లో ఉన్న ఆగ్రహావేశాలు గుర్తించడం లేదు. ఇప్పుడు హర్యానా,కాశ్మీర్‌లలో కూడా బిజెపి వ్యతిరేకత కానవస్తోంది. బీహార్‌లో కండువాలు మారుస్తున్న నితీశ్ కుమార్ తీరుపైనా వ్యతిరేకత పెరుగుతోంది. మహారాష్ట్రలోనూ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. ప్రజలు హిందుత్వ ఒక్కటే కోరుకోవడం లేదు. దానితో పాటు బతకాడానికి అవసరమైన పరిస్థితులు కావాలని చూస్తున్నారు. అవన్నీ లేనప్పుడు హిందుత్వ అన్నం పెట్టదని పాలకులు గుర్తించాలి. ఇవన్నీ ఆసరాగా చేసుకుని విపక్షాలు ఏకమవుతున్నాయి. అలాగే ఒక్కో రాష్ట్రంలో ఉన్న పార్టీలకు తోడు కొత్త పార్టీలు పుట్టుకుని వస్తున్నాయి. బీహరా రాజకీయాలను తీసుకుంటే అక్కడ నితీశ్‌తో కలసి అధికారంలో ఉన్న బిజెపి పెద్దగా ఏమీ చేయలేకపోతున్నది. దీంతో ప్రశాంత్ కిశోర్ కొత్త పార్టీతో ఆశలు కల్పిస్తున్నారు. ప్రచారకర్తగా, సలహాదారుగా ఉన్న ప్రశాంత్ కిశోర్ ఒక రాజకీయపార్టీని ఆరంభించి బిహార్ ఎన్నికల బరిలోకి దిగారు. ఎన్నో రాజకీయపక్షాలను గద్దెనెక్కించిన తాను, ప్రజల హృదయాలను గెలవలేనా? అన్న విశ్వాసం తో అక్టోబర్ 2 గాంధీజయంతినాడు 'జన్ సురాజ్' పార్టీని ప్రకటించారు. వచ్చే ఏడాది బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో, అన్ని స్థానాల్లోనూ పోటీచేసి, అధికం గెలిచి, అధికారాన్ని కైవసం చేసుకోగలనన్నది ఆయన విశ్వాసం. తనమీదతనకు అంత నమ్మకంతోపాటు, బిహార్ ప్రజలమీద ఆయనకు అంత విశ్వాసం ఉందని ప్రకటించుకున్నారు. ఇదంతా ఓ రకంగా చెప్పాలంటే నితీశ్, బిజెపి కూటమి వైఫల్యమనే చెప్పాలి. ఇప్పటికే ఉన్న నిషేధాన్ని తొలగించి మద్యాన్ని ప్రవహింపచేస్తానని ఆయన ప్రకటించాడు. అంటే ప్రజలు మద్యాన్ని కోరుకుంటున్నారు కానీ, నిషేధం కాదని గ్రహించాడు. ఓట్ల కోసం ఇలాంటి చౌకబారు ఎత్తుగడలు అందరూ అవలంబిస్తున్నారు. బిహార్‌లో మద్యనిషేధం అమలు మీద భిన్నాభి ప్రాయాలున్నాయి. ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ తన నిర్ణయం సూపర్ హిట్ అని ఎలాగూ చెప్పుకుంటారు. మహిళలు నితీశ్‌ఫోటోను ఆరాధిస్తున్నారని, నిరుపేదల కుటుంబాలు బాగుపడి, కాస్తంత దాచుకుంటు న్నాయని ఆయన పార్టీ ప్రచారం చేసుకుంటుంది. ఈ పరిస్థితుల్లో, తాను బిహార్‌లో అధికారంలోకి వచ్చిన పావుగంటలో మద్యనిషేధాన్ని ఎత్తేస్తానని, రాష్ట్రంలో కుప్పకూలిన విద్యారంగాన్ని ఉద్ధరించడానికి ఆ సొమ్మును ఖర్చుచేస్తానని పీకే ప్రకటించారు. మద్యం అమ్మకాలద్వారా వచ్చే రాబడి ఎంత, విద్యారంగాన్ని బాగుచేయడానికి ఐదేళ్ళకాలంలో ఎంతకావాలన్న జమాఖర్చులు ఆయన ప్రజలకు విప్పిచెప్పారు. బిహార్‌కు రావాల్సిన డబ్బును మోదీ తన గుజరాత్‌కు తరలించుకుపోతున్నాడని, కేంద్రం నుంచి బిహార్‌కు రావ్వాల్సినదాన్ని రాష్ట్రనేతలు సాధించడం లేదని కొన్ని విమర్శలు సైతం పీకే చేశారు. అంటే బీహార్‌కు పెద్దగా కేంద్రం నిధులు ఇవ్వడం లేదన్నది గమనించవచ్చు. అలా ఏ ఇతర రాష్ట్రానికి కూడా పెద్దగా ఖర్చు చేయడం లేదు. తెలంగాణకు దమ్మిడీ ఇవ్వడం లేదు కానీ ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. కర్నాటకలో అక్రమాలకు పాల్పడి అధికారం కోల్పోయాక ఇప్పుడు అక్కడ మళ్లీ అధికారం కోసం కుత్సిత రాజకీయాలు మొదలు పెట్టారు. ఇలాంటి రాజకీయాలను ప్రజలు ఎంతోకాలం సహించరు. ప్రజలకు మేలు చేయని నిర్ణయాలను స్వాగతించరని మోడీ ద్వయం ఎంత త్వరగా గుర్తిస్తే..దేశానికి అంత మంచిది.

# తీవ్రవాదం అంతానికి కలిసి పనిచేద్దాం



న్యూఢిల్లీ, మావోయిస్టు తీవ్రవాదం తుదిదశకు చేరుకుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలపై కేంద్రం దృష్టిపెట్టినట్లు తెలిపారు. అమిత్ షా అధ్యక్షతన మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల సీఎంల సదస్సు దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ప్రారంభమైంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టు తీవ్రవాదం అంతం కోసం అన్ని రాష్ట్రాలు సహకరించాలని పిలుపునిచ్చారు. దేశంలో మావోయిస్టు తీవ్రవాదం తుదిదశకు చేరింది. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇప్పటివరకు 13 వేల మందికి పైగా మావోయిస్టులు ఆయుధాలు వదిలేశారు. 2024లో 202 మంది మావోయిస్టులు మృతిచెందగా.. 723 మంది లొంగిపోయారు. భవిష్యత్తులో మరింత స్ఫూర్తితో ఒకే లక్ష్యంతో ముందుకెళ్లాలి. ఛత్తీస్‌గఢ్ విజయం అందరికీ ప్రేరణగా నిలుస్తోంది. అక్కడ కొందరు మావోయిస్టులు లొంగిపోయారని అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టు రహితంగా మార్చేందుకు అన్ని రాష్ట్రాలు సహకరించాలని షా పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఛత్తీస్‌గఢ్ సీఎం, డీజీపీని ఆయన అభినందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల ప్రయోజనాలు ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. పదేళ్లలో మోదీ సర్కార్ చేసిన అభివృద్ధి గురించి వివరించారు. 'పదేళ్లలో 11,500 కిలోమీటర్ల మేర రోడ్ నెట్‌వర్క్‌తో పాటు 15,300 సెల్‌ఫోన్ టవర్లను ఏర్పాటుచేశాం. 165 ఏకలవ్య ఆదర్శ పాఠశాలలు ఏర్పాటుచేశాం. గతంలో హింసాత్మక ఘటనలు 16,400కు పైగా జరిగాయి. ప్రస్తుతం ఇలాంటి ఘటనలు 7,700లకు తగ్గాయని వెల్లడించారు. పౌరులు, భద్రతా బలగాల మరణాలు 70 శాతం తగ్గాయి. హింస ప్రభావిత జిల్లాలు 96 నుంచి 42కు తగ్గాయి. హింసాత్మక ఘటనలు నమోదయ్యే పోలీసుస్టేషన్ల సంఖ్య 465 నుంచి 171కి తగ్గింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే ఇది సాధ్యమైందని అమిత్ షా పేర్కొన్నారు. హింస మార్గంలో ఏం సాధించలేమని.. జన జీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టులకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. హింస మార్గాన్ని వీడే మావోయిస్టుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వాటిని వినియోగించుకుని ప్రజల్లోకి రావాలని మావోయిస్టుల కు ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా సూచించారు. ఈ సమావేశంలో 2023, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో నక్సలిజం అంతం, అర్బన్ నక్సల్స్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. మావోయిస్టు కార్యకలాపాలను కట్టడి చేయడంతో పాటు పోలీస్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర చాలా బాగా పనిచేశాయని ఆయన పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం వికసిత భారత్ లక్ష్యంగా పని చేస్తుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయితే వికసిత భారత్ సాధించాలంటే గిరిజనులు, ఆదివాసీలు సైతం అందులో భాగస్వామ్యం కావాలన్నారు. ఈనీ ప్రభుత్వ ఫలాలు గిరిజనులు, ఆదివాసీలకు అందకుండా మావోయిస్టులు అడ్డుకుంటున్నారని కేంద్ర మంత్రి అమిత్ షా మండిపడ్డారు. రహదారులు, టవర్లు, చివరకు విద్య, వైద్యం సైతం వీరికి చేరనివ్వడం లేదన్నారు. అయితే గత కొన్నేళ్లుగా మావోయిస్టు సమస్యను ఎదుర్కొనే విషయంలో మోదీ సర్కార్ గణనీయమైన పురోగతి సాధించిందని ఆయన పేర్కొన్నారు. 2022లో తొలి సారి మావోయిస్టు హింస కారణంగా జరిగిన మరణాల సంఖ్య 100 కంటే తక్కువ నమోదయిందని వివరించారు. అలాగే మావోయిస్టుల ప్రభావిత గిరిజన ఆదివాసీ ప్రాంతాలకు ప్రభుత్వ ఫలాలు, పథకాలు సైతం వేగంగా చేరుతున్నాయని తెలిపారు. మావోయిస్టుల సమస్యను అధిగమించేందుకు బహుముఖ వ్యూహాన్ని సైతం అమలు చేస్తున్నామన్నారు. దీంతో ఈ సమస్యను చాలా సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఈ క్రమంలో వివిధ రాష్ట్రాల పోలీస్ విభాగాలు సైతం చాలా బాగా పని చేస్తున్నాయన్నారు. ఇక ఎన్‌కౌంటర్‌లలో గాయపడిన భద్రత బలగాలను త్వరితగతిన వైద్య చికిత్స అందించేందుకు హెలికాప్టర్ సేవలను వినియోగిస్తున్నామని గుర్తు చేశారు. అయితే ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో వామపక్ష తీవ్రవాదంపై పైచేయి సాధించామని హోం మంత్రి అమిత్ షా ఈ సందర్భంగా వివరించారు. ఈ సమీక్షా సమావేశానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇక ఆంధ్రప్రదేశ్ నుంచి హోం శాఖ మంత్రి వంగలపూడి అనితతోపాటు డీజీపీ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. అలాగే జార్ఖండ్, బిహార్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. మరోవైపు భవిష్యత్తులో వామపక్ష తీవ్రవాదం దేశానికి ముప్పుగా పరిణమిస్తుందని కేంద్రంలోని మోదీ సర్కార్ భావిస్తుంది. ఆ క్రమంలో వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేసేందుక చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో దశాబ్దాల క్రితం నేపాల్ నుంచి ఆంధ్రప్రదేశ్ వరకు పశుపతి టూ తిరుపతి కారిడార్ ఏర్పాటు చేసేందుకు మావోయిస్టులు ఉపక్రమించారు. అయితే దీనిని సైతం మోదీ సర్కార్ ధ్వంసం చేసిన విషయాన్ని ఇటీవల కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇంకోవైపు సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు మావోయిస్టులు వార్షికోత్సవాలు జరపాలంటూ కేడర్‌కు పిలుపు నిచ్చింది. అలాంటి వేళ.. ఛత్తీస్‌గఢ్‌లో శనివారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో దాదాపు 35 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇక ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేతకు భద్రత దళాలు ముమ్మర చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ సరిహద్దు రాష్ట్రాల్లోకి వెళ్లకుండా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకున్నాయి. అందులో భాగంగా ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల వద్ద భారీగా భద్రతా దళాలను మోహరించారు. ఇక దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టిన సంగతి తెలిసిందే.

# ఉల్లి,టమాటా ధరల మోత

హైదరాబాద్,సామాన్య జనాలకు కూరగాయల ధరలు షాకిస్తున్నాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇందులో ముఖ్యంగా టమాటా కొండెక్కి కూర్చుంది. మార్కెట్‌లో టమాటా ధర రూ.100 పలుకుంది. హోల్‌సేల్ మార్కెట్లు, మండీలలో టమాటా రూ.80 నుంచి రూ.90 వరకు ఉంది. ఇక, ఉల్లిగడ్డ ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలో ఉల్లి ధర రూ.80కి చేరింది. అలాగే, కిలో బెండకాయలు రూ.70, బీన్స్ రూ.100, దొండ రూ.60, క్యాప్సికం రూ.80, బీరకాయ రూ.70 చొప్పున మార్కెట్లలో విక్రయిస్తున్నారు. అయితే, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతోనే ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. సామాన్య ప్రజలు మాత్రం..కూరగాయల ధరలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే వర్షాల ప్రభావంతో టమాట ధరలు భారీగా పెరుగుతున్నాయి. నెలన్నర క్రితం వరకు కిలో రూ.20 నుంచి రూ.30 పలికిన ధర ఇప్పుడు రూ.100కు చేరువవుతోంది. ప్రస్తుతం రైతుబజార్లు, హోల్‌సేల్‌లో కిలో టమాట ధర రూ.60–80 ఉండగా.. రిటైల్ మార్కెట్‌లో రూ.100కు చేరువైంది. డిమాండ్‌కు సరిపడా టమాట రాకపోవడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టమాట పంట దెబ్బతిందని.. దీంతో ధరలు అమాంతం పెరిగాయని పేర్కొంటున్నారు. సాధారణంగా ఈ సమయంలో టమాట ధరలు తగ్గి.. వేసవిలో పెరుగుతాయి. వర్ష ప్రభావంతో ప్రస్తుతం ధరలు పెరిగాయని, కొత్త పంట చేతికొచ్చే వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఉల్లి ధర సైతం భారీగా పెరిగింది. రైతుబజార్లలో కిలో రూ.50 చొప్పున విక్రయిస్తుండగా.. రిటైల్, ఇతర మార్కెట్లలో రూ.60–70కి తగ్గడంలేదు. రిటైల్‌మార్కెట్లలో కిలో బెండకాయలు రూ.70, బీన్స్ రూ.100, దొండ రూ.60, క్యాప్సికం రూ.80, బీరకాయ రూ.70 చొప్పున విక్రయిస్తున్నారు.

# పొలిటికల్ స్కెచ్!?

విజయవాడ:పవన్ కల్యాణ్.. దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఈ పేరు మారుమోగుతోంది. తిరుపతి లడ్డూ కల్తీ వివాదం విషయంలో జనసేన అధినేత పవన్ చేసిన వ్యాఖ్యలు సరికొత్త చర్చకు దారితీశాయి. ఏపీలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కల్యాణ్ కొనసాగుతున్నారు. అయితే, ప్రస్తుతం ఆయన ఉన్నట్లుండి తమిళనాడు రాజకీయాలపై దృష్టిసారించినట్లు కనిపిస్తోంది. పవన్ వ్యూహం వెనుక బిగ్ స్కెచ్ ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. వచ్చే ఏడాది చివరిలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఆ ఎన్నికల నాటికి తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేలా పవన్ ఇప్పటి నుంచి కసరత్తు మొదలు పెట్టినట్లు ప్రచారం జరుగుతుంది. ఇంతకీ.. పవన్ తమిళనాడు రాజకీయాల్లో ఎలాంటి పాత్ర పోషించబోతున్నారు.. ఏపీలో ఫార్ములాను తమిళనాట ప్రయోగించబోతున్నారా.. పవన్ తమిళ రాజకీయం అక్కడి సినీ ఇండస్ట్రీపై ఎలాంటి ప్రభావం చూపబోతుందో అన్నన చర్చ మొదలైంది. ఏపీలో గత ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి పోటీచేశాయి. ఈ క్రమంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ సారధ్యంలోని జనసేన పార్టీ వందశాతం స్ట్రైక్ రేట్ తో విజయం సాధించింది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పవన్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఏపీలో వైసీపీ దారుణ ఓటమికి చంద్రబాబుతోపాటు పవన్ కల్యాణ్ దికూడా కీలక భూమిక. చంద్రబాబు వ్యూహం, పవన్ దూకుడుతో వైసీపీ కేవలం పదకొండు స్థానాలకే పరిమితం అయింది. ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి జగన్ ఐదేళ్ల పాలనలో అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఈ క్రమంలోనే జగన్ హయాంలో తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించినట్లు లాబ్ రిపోర్టులు వచ్చాయి. తిరుపతి వేంకటేశ్వర స్వామి అంటే దేశవ్యాప్తంగానే కాక.. ప్రపంచ వ్యాప్తంగా హిందువులు భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. అలాంటి తిరుమలలో జగన్ హయాంలో కల్తీ నెయ్యి వాడారనే విషయం పెద్ద దుమారాన్నే రేపింది. అపచారం జరిగినందుకు క్షమించమని కోరుతూ పవన్ పదకొండు రోజుల పాటు ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. తిరుమల కొండపై దీక్షను విరమించి తిరుపతిలో వారాహి సభ నిర్వహించారు. ఈ సభలో వారాహి డిక్లరేషన్ చేస్తూ సనాతన ధర్మం గురించి పవన్ మాట్లాడారు. ఇదే క్రమంలో తమిళనాడు డిప్యూటీ సీఎంగా ఉన్న ఉదయనిధి స్టాలిన్ గతంలో సనాతన ధర్మం గురించి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. సనాతన ధర్మం జోలికి వస్తే ఊరుకునేది లేదని సీరియస్‌గానే పవన్ వార్నింగ్ ఇచ్చారు. వారాహి సభలో పవన్ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా చర్చ జరిగింది.. తమిళనాడులో అయితే పవన్ వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపాయి. పవన్ వ్యాఖ్యలపై ఉదయనిధి స్టాలిన్ స్పందించకపోయినా.. డీఎంకే పార్టీ, ఆ పార్టీ మద్దతుదారులు సోషల్ మీడియా వేదికగా రియాక్టయ్యారు. పవన్ కళ్యాణ్‌కు కౌంటర్లు ఇస్తున్నారు. దీనికి తోడు పవన్ కల్యాణ్ పై తమిళనాడులో కేసు కూడా నమోదైంది. ఇదంతా ఒకెత్తయితే.. తమిళనాడు గురించి పవన్ మాట్లాడిన ప్రతి మాట వెనుక వ్యూహాత్మక ఎత్తుగడ ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. తమిళనాట మరో ఏడాదిన్నరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను టార్గెట్‌గా చేసుకొని పవన్ ఇప్పటి నుంచే తన వ్యూహాన్ని అమలు చేస్తున్నారని, ఆయన వెనుక బీజేపీ పెద్దలు ఉన్నారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి. తమిళనాడులో పట్టు సాధించాలని బీజేపీ ఎప్పటినుంచో ప్రయత్నాలు చేస్తున్నది. కానీ, సాధ్యం కావటం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తుతో ఎన్నికలకు వెళ్లినా పెద్దగా ఫలితం దక్కలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విడిగా పోటీ చేసింది. కనీసం ఒక్కసీటును కూడా దక్కించుకోలేక పోయింది. దీనికితోడు కాంగ్రెస్, డీకేఎం కూటమి 39 పార్లమెంట్ నియోజకవర్గాల్లో విజయం సాధించి క్లీన్ స్వీప్ చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో తమిళనాడులో బీజేపీ అన్నామలైను హైలెట్ చేసింది. అన్నామలైకు రాష్ట్ర వ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ వచ్చినప్పటికీ అది ఓటుగా మారలేదు. దీంతో బీజేపీ ఈసారి పవన్ కల్యాణ్ ను తమిళనాడులో ప్రయోగించాలని భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. పవన్ కల్యాణ్ తమిళనాడు రాజకీయాల్లో హిందుత్వం పేరుతో ఎంట్రీ ఇస్తే.. అక్కడి సినీ పరిశ్రమ మద్దతు కూడా లభిస్తుందని బీజేపీ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. దీంతో పవన్ సైతం తమిళ రాజకీయాలపై దృష్టి కేంద్రీకరించారు. హిందుత్వం పేరుతో తమిళనాడులోని హిందువులను ఏకతాటిపైకి తీసుకురావడంతో పాటు.. ఏపీలో ప్రయోగించిన ఫార్ములాను తమిళనాడులో ప్రయోగించాలని పవన్, బీజేపీ పెద్దలు భావిస్తున్నారట. ఏపీలో ఎన్నికల ముందు బీజేపీ, టీడీపీని ఒకేతాటిపైకి తీసుకురావడంలో పవన్ పాత్ర కీలకమైంది. అదే సమయంలో తమిళనాడులో డీఎంకేకు గట్టి పోటీదారుగా ఉన్న అన్నాడీఎంకే, ఇతర పార్టీలను బీజేపీ పక్కకు తీసుకొచ్చేలా పవన్ పావులు కదుపుతున్నారు. సినీ హీరో విజయ్ కొత్త పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని ఇప్పటికే విజయ్ చెప్పారు. విజయ్ కు తమిళనాట మంచి క్రేజ్ ఉంది.

# గత పదేళ్లలో నగరం చుట్టూ చెరువుల ఆక్రమణలు

హైదరాబాద్,తెలంగాణలో నాలాలు, చెరువులు అక్రమించి.. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై రేవంత్ రెడ్డి సర్కార్ ఉక్కుపాదం మోపుతుంది. అందులోభాగంగా హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఈ హైడ్రాపై విపక్షాలు ఆరోపణలు గుప్పిస్తున్నాయి. హైడ్రా పేరుతో తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తప్పుడు ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ విపక్షాలపై ఆయన మండిపడ్డారు. హైడ్రాపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలపై అపోహలు సృష్టిస్తున్నారని ఉ పముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసహనం వ్యక్తం చేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ.. ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మేలు చేయాలనే ఆలోచనే తప్ప.. తమకు ఎలాంటి వ్యక్తిగత అజెండా లేదన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడారు. 2014 నుంచి 2023 మధ్య కాలంలో హైదరాబాద్, చుట్టు పక్క ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన చెరువుల వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులతో కలిసి భట్టి వివరించారు.ఇది ప్రజా ప్రభుత్వం.. పారదర్శకమైన ప్రభుత్వం. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయి. హైదరాబాద్‌లోని చెరువులు ప్రజల ఆస్తి అన్నారు. హైదరాబాద్ అంటేనే రాక్స్, లేక్స్, పార్క్స్. ఇవి హైదరాబాద్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. నగరంలో గత కొన్నేళ్లుగా చెరువులు మాయం అవుతున్నాయి. మూసీని ఆధునికీకరించాలని గతంలో చాలా ప్రయత్నాలు జరిగాయి. శాటిలైట్ మ్యాప్‌ల ద్వారా చెరువుల ఆక్రమణలను గుర్తిస్తున్నాం అని భట్టి వివరించారు. రాష్ట్ర విభజన జరిగే నాటికి ఎన్ని చెరువులు ఉన్నాయి.. ఇప్పుడెన్ని ఉన్నాయి అనే వివరాలు సేకరిస్తున్నాం. హైడ్రాను తీసుకొచ్చింది సీఎం కోసమో, మంత్రుల కోసమో కాదు కదా. చెరువులు అన్యాక్రాంతం కాకుండా కొత్త నిబంధనలు తెచ్చుకున్నాం. చెరువులను భవిష్యత్ తరాలకు అందించాల్సి ఉందని భట్టి వివరించారు. ఇప్పటికైనా చెరువుల ఆక్రమణ ఆపాలి. మూసీలో మంచినీళ్లు లేకుండా డ్రైనేజీగా మార్చేశాం. గతంలో ఇతర దేశాల్లోనూ నదులు డ్రైనేజీల్లా ఉండేవి.. వాళ్లు మార్చుకున్నారు. ఇతర దేశాలు నదులను ఆస్తులుగా మార్చుకున్నాయి. మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని ప్రతిపక్షాలు అంటున్నాయి. టెండర్లే పిలవకుండా రూ.లక్షన్నర కోట్లు అవుతుందని ఎలా చెబుతారు? మూసీ సుందరీకరణ అంశంపై ప్రతిపక్షాలు తమ ఆలోచనలు మాకు తెలియజేయాలి. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ఎవరికీ ఇబ్బంది కలిగించం. ఇళ్లను తొలగించిన బాధితులకు వేరేచోట ఇళ్లు ఇస్తున్నాం. కూలగొట్టిన ఇళ్ల కంటే మెరుగైన ఇళ్లను ఇస్తున్నాం. ప్రజలకు మేలు జరగకూడదనేదే ప్రతిపక్షాల అజెండా. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చేందుకు ప్రతిపక్షాలు సలహాలు ఇవ్వాలి. పరిపాలనలో చిన్న చిన్న పొరపాట్లు జరిగితే సరిదిద్దుకోవడానికి మేం సిద్ధంగా ఉన్నాం అని భట్టి అన్నారు. అలాగే నగరానికి మూసి నది మణిహారంగా మార్చాలన్నదే తమ లక్ష్యమని ఆయన తెలిపారు. నగరంలో చాలా చెరువులు, పార్కులు, కబ్జాకు గురయ్యాయన్నారు. ప్రజలకు మేలు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కొన్నేళ్లుగా కబ్జాలతో హైదరాబాద్‌లో చెరువులు మాయమైనాయని అన్నారు. చెరువుల అక్రమణతో ప్రజలకు పెను ప్రమాదం పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మూసి నది పరివాహక ప్రాంతంలో అక్రమణలను సైతం రేవంత్ రెడ్డి సర్కార్ తొలగిస్తుంది. ఆ క్రమంలో పేదలు, మధ్యతరగతి వారి నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ఈ నేపథ్యంలో విపక్షాలు సైతం స్పందించాయి. అందులోభాగంగా రేవంత్ రెడ్డి సర్కార్‌పై విమర్శలు గుప్పిస్తున్నాయి. ఇక ఇదే అంశంపై మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ సైతం స్పందించారు. అందులోభాగంగా రేవంత్ రెడ్డికి ఆదివారం ఎంపీ ఈటల బహిరంగ లేఖ రాశారు. లేఖలో హైడ్రా పేరుతో రేవంత్ సర్కార్ దూకుడు మీద వెళ్తుందంటూ ఎంపీ ఈటల ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఇక బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ సైతం హైడ్రాపై కీలక ఆరోపణలు చేశారు. మరో విపక్షం బీఆర్ఎస్ నేతలు అయితే.. హైడ్రా తీసుకుంటున్న నిర్ణయాలపై మండిపడుతున్నారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కపై విధంగా స్పందించారు.

# జగన్ స్ట్రాంగ్ డెసిషన్

అమరావతి,వైసీపీ అన్నది జగన్ కలల సౌధం. ఆయన ఆ పార్టీకి అధినేత. నేను మీ అందరికీ ప్రతినిధిని అని జగన్ తాజాగా పార్టీ నేతలతో అనవచ్చు కానీ జగన్ రెక్కల కష్టం వైసీపీ. జగన్ ఆశల రూపం వైసీపీ. జగన్ నిర్ణయమే అక్కడ ఫైనల్.వైసీపీ బాగుండాలనే జగన్ ఆలోచిస్తారు. అదే సమయంలో ఎవరైనా సలహాలు ఇస్తే ఆయన స్వీకరించవచ్చు లేదా పక్కన పెట్టవచ్చు. ఇక వైసీపీలో ఉన్న వారు జగన్ ఆలోచనల మేరకు పనిచేయాలి. పార్టీ అంటే అలాగే ఉండాలి, ఒకే మాట మీద క్రమశిక్షణతో అన్నది జగన్ ఆలోచన.జగన్ పార్టీ వయసు 13 ఏళ్ళు. మరో నాలుగు నెలలలో 14 ఏళ్ల పార్టీ అవుతుంది. అయితే ఈ తక్కువ టైం లో ఎన్నో ఆటుపోట్లను వైసీపీ చూసింది. జగన్ మూడున్నర పదుల వయసులోనే అతి పెద్ద రాజకీయ సవాల్ ఎదుర్కొన్నారు. దాంతో జగన్ కి కష్టాలు అలవాటు అయిపోయాయి. సవాళ్ళు కూడా ఆయన ఏవి వచ్చినా లెక్కచేయరు.అయితే పార్టీ విపక్షంలో ఉండగా చేరడం వేరు. విపక్షం నుంచి అధికారంలోకి వచ్చి మళ్లీ విపక్షంలోకి వచ్చాక కొనసాగడం వేరు. ఈ తత్వం సరిపడని వారు పార్టీ గేటుని దాటి బయటకు వెళ్ళిపోయారు. అందులో జగన్ సొంత బంధువు అయిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఉన్నారు.అదే విధంగా వైఎస్సార్ ఫ్యామిలీకి విధేయంగా ఉన్న మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ళ నాని, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, కిలారి రోశయ్య, ఉదయభాను వంటి వారు ఉన్నారు. అయితే ఇలా వెళ్ళిన వారి విషయంలో వైసీపీ ఏమీ పిలిచి బతిమాలింది లేదు. పార్టీ ఓటమి పాలు అయింది. అయిదేళ్ల పాటు ఎన్నో సవాళ్ళు ఉంటాయి. వాటికి తట్టుకుని ఉండేవారు ఉంటారు అన్నదే వైసీపీ అధినాయకత్వం ఆలోచన.పైగా ప్రజల నుంచే నేతలు వస్తారు అన్నది కూడా వైసీపీ మాట. అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎన్ని చేసినా వ్యతిరేకత కచ్చితంగా వస్తుందని ఆ వ్యతిరేకత ప్రతిపక్షానికి సొమ్ము అవుతుందని అపుడు జనాల నుంచే నాయకులు వచ్చి జెండా ఎత్తుతారని కూడా వైసీపీ నమ్మకంగా ఉంది.ఇక పార్టీలో ఉన్న నేతలతోనే బండిని నడిపించాలని కూడా డిసైడ్ అయింది. అదే సమయంలో వైసీపీ ఎన్నడూ లేనంతగా కేవలం 11 సీట్లకే పరిమితం అయి దారుణంగా ఉన్న వేళ ఈ కష్టకాలంలో పార్టీని విడిచి వెళ్ళిన వారి పట్ల వైసీపీ అధినాయకత్వం అయితే సీరియస్ గానే ఉంది అని అంటున్నారు.ఇలా వెళ్ళిన వారు కూటమి అధికారంలో ఉంది కదా అని తమకు అవకాశాలు ఉంటాయని భావించి ఉంటారని అనుకుంటోంది. ఒకవేళ అక్కడ అవకాశాలు దక్కకపోతే మాత్రం వారు కచ్చితంగా మళ్లీ వెనక్కే వస్తారు

# రుణమాఫీపై మీరు చెప్పిందేమిటి..చేసిందేమిటి



హైదరాబాద్,రుణమాఫీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను విమర్శిస్తూ సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయడాన్ని తెలంగాణ శాసనసభ బీజేపీ పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఖండించారు. సీఎం లేఖ వాస్తవాలకు దూరంగా ఉందని ఆయన అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మేలు చేసేందుకే ప్రధానికి అబద్దాలతో కూడిన లేఖ రాశారంటూ మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమని, వేదిక ఖరారు చేయాలంటూ సీఎం రేవంత్‌కు ఏలేటి సవాల్ విసురుతూ బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ రైతులకు పంట రుణాల మాఫీ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం నాడు ప్రధాని మోదీకి రాసిన లేఖ కొన్ని వాస్తవాలను కప్పిపుచ్చేలా ఉంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పీసీసీ చీఫ్‌గా మీరు(రేవంత్ రెడ్డి) కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 2023 డిసెంబర్ 9న రైతులందరికీ రూ.2లక్షల వరకూ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చింది వాస్తవం కాదా?. కానీ, అధికారం చేపట్టి 6నెలలైనా రుణమాఫీ అమలు చేయకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతుల్లో ఆగ్రహం పెరిగింది. ఇది గ్రహించిన మీరు.. 2024 మే నెలలో జరిగిన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో 2024 ఆగస్టు 15 కల్లా మాఫీ చేస్తామని కనిపించిన దేవుళ్లందరిపైనా ఒట్టు వేశారు. తీరా ఆగస్టు 15 కల్లా మీరు పంట రుణాలను సగం మంది రైతులకు మాత్రమే మాఫీ చేశారు. మిగిలిని సగం మందికి మాఫీ చేయని మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని ప్రధాని మోదీ అక్టోబర్ 5న మహారాష్ట్రలో జరిగిన ఓ బహిరంగ సభలో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ పూర్తిగా అమలు చేయలేదని, మాఫీ కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారంటూ ప్రధాని వాస్తవాలను వివరించారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలు మహారాష్ట్ర రైతులను ప్రభావితం చేస్తాయని, తద్వారా ఆ రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని దెబ్బతీస్తాయని అధిష్ఠానం మీకు చెప్పింది. వారి ఆదేశాలతోనే రుణమాఫీ విషయంలో అబద్ధాలను రంగరిస్తూ ప్రధాని మోదీకి మీరు లేఖ రాశారు. మాఫీ చేశామని మీరు చెప్పడం తెలంగాణ ప్రజలనే కాకుండా దేశ ప్రజలను సైతం తప్పుదోవ పట్టించడం.. మోసం చేయడం కాదా అంటూ ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2లక్షలలోపు పంట రుణాలు ఒకే దఫాలో మాఫీ చేస్తామని టీపీసీసీ చీఫ్‌గా మీరు(రేవంత్ రెడ్డి) అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హామీ ఇవ్వలేదా?, ప్రస్తుతం సగం మంది రైతులకు మాఫీ కాని మాట వాస్తవం కాదా?కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డిసెంబరు 9న అర్హులైన రైతులందరికీ మాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల వేళ హామీ ఇచ్చారు కదా? మరిప్పుడు పది నెలలైనా ఆ హామీ పూర్తిగా అమలు కాలేదన్నది వాస్తవం కాదా3. రూ.2లక్షల లోపు పంట రుణాలు మాఫీ చేసేందుకు రూ.49,500కోట్లు అవసరం అవుతాయని స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ(ఎస్ఎల్బీసీ) మొదట్లోనే చెప్పిన మాట నిజం కాదా? ఆ తర్వాత పంట రుణమాఫీకి రూ.40వేల కోట్లు ఖర్చవుతాయని మే ఒకటిన గాంధీ భవన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రిగా మీరు మాట్లాడింది నిజం కాదా? లోక్ సభ ఎన్నికల సందర్భంగా ప్రచారంలో భాగంగా 2024 ఆగస్టు 15 కల్లా రైతులందరికీ రుణమాఫీ చేస్తామని మీరు దేవళ్లపై ఒట్లు వేసింది వాస్తవం కాదా అన్నారు. తర్వాత జరిగిన క్యాబినెట్ సమావేశంలో రుణమాఫీకి రూ.31వేల కోట్లు అవసరమని నిర్ణయించింది నిజం కాదా? అన్నారు. కానీ, తీరా రాష్ట్ర బ్జడెట్లో రుణమాఫీ పథకానికి మీరు కేటాయించింది కేవలం రూ.26వేల కోట్లు మాత్రమే. అదీ వాస్తవం కాదా? జులై 18నుంచి ఆగస్టు 15వరకు కేవలం 22.22లక్షల మంది అన్నదాతలకు రూ.17.869 కోట్లు మాత్రమే మాఫీ చేసిన మాట నిజం కాదా? ఇది మొత్తం రుణమాఫీ చేయాల్సిన నిధుల్లో సగం కంటే తక్కువ కాదా? అంటూ పలు ప్రశ్నలు సంధించారు. రుణమాఫీ అంశంలో కాంగ్రెస్ చెప్పిందేంటి, చేసిందేంటని.. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి సవాల్ చేశారు. చర్చకు సిద్ధమైతే తేదీ, వేదిక ఖరారు చేసి చెప్పాలన్నారు. బహిరంగ చర్చ వద్దనుకుంటే రుణమాఫీతోపాటు కాంగ్రెస్ పార్టీ రైతులకిచ్చిన ఇతర హామీలపైనా చర్చించేందుకు తక్షణమే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

### లారీ ఢీకొనడంతో ఇద్దరు దుర్మరణం

హైదరాబాద్,హైదరాద్ మీర్‌పేట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం ఉదయం టీకేఆర్ కమాన్ దగ్గర వేగంగా అత్యంత వేగంగా వచ్చిన ఓ లారీ, ఇద్దరిని ఢీకొట్టింది. వారి మీదనుంచి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా నుజ్జునుజ్జయినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘనాస్థలానికి చేరుకుని పరిశీలించారు.

# దేవాలయాల విశిష్టత కాపాడుకుందాం..

అమరావతి,హిందువులు పరమ పవిత్రంగా భావించే దేవాలయాల్లో అడుగడుగునా అపవిత్ర సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. సనాతన ధర్మాన్ని కొంతమంది స్వార్థపరులు అధర్మం వైపు నడిపిస్తున్నారు. దేవుడి పేరు చెప్పుకుని దోచుకునే వారు కొందరైతే.. ప్రసాదాల ముసుగులో సొంత ఖజానా నింపుకునేవారు మరికొందరున్నారు. ఇలా రోజు రోజుకు హిందూ దేవాలయాల్లో అవినీతి అక్రమాలు పెచ్చుమీరిపోతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే అత్యంత పవిత్రమైన దేవాలయాలను కొంతమంది ఆర్థిక అవసరాలకు వేదికగా మార్చేసుకుంటున్నారు. దీంతో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో ఎటు చూసినా ఈ తరహా సంఘటనలే కనిపిస్తున్నాయి. ఆచారాలను కట్టుబాట్లను పవిత్రంగా భావించే పూజారుల కంటె బ్రోకర్ల హడావిడే ఎక్కువగా కనిపిస్తోంది. ఫలితంగా పలు ఆలయాలు అవినీతి కంపుతో నిండిపోతున్నాయి. ముఖ్యంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుపతి లడ్డూ వ్యవహారంతో రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల పర్యవేక్షణకు టాస్క్ ఫోర్స్, ప్రత్యేక కమిషన్లలో ఏదో ఒకటైనా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది. ఇటు ఏపీలో, అటు తెలంగాణాలో భక్తుల నుంచి ఇదే మాట వినిపిస్తోంది.మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహిళా కమిషన్ తరహాలోనే రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల పర్యవేక్షణకు ప్రత్యేక కమిషన్లను ఏర్పాటు చేయడం ద్వారా దేవుళ్ల పేరుతో దోపిడీ చేస్తున్న స్వార్థపరుల ఆటకట్టించొచ్చు అన్న వాదన బలంగా వినిపిస్తోంది. అదే విధంగా దేవాలయాల్లో అవినీతిని తరిమికొట్టేందుకు సర్వరోగ నివారిణిగా టాస్కోఫర్స్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే పలు ఆలయాల్లో నిర్వాణా లోపం ఉన్నట్లు సంబంధిత అధికారులు పలు సందర్భాల్లో గుర్తించారు. ఆ దిశగా జరిపిన విచారణలో కూడా ఆక్రమాలు వాస్తవాలేనని నిర్ధారణకు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో చోటు చేసుకుంటున్న అనేక స్కాములు కూడా ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. కేవలం ప్రసాదాల తయారీలో మాత్రమే కాదు.. ఇతర అంశాల్లో కూడా అనేక సమస్యలు దేవాలయాలను చుట్టుముడుతున్నాయి.సమస్యల పరిష్కారం పేరుతో ఆలయ కార్యనిర్వాహణాధికారులు, పాలక మండళ్లు అందిన కాడికి బొక్కేసే పనిలో ఉంటున్నాయి కానీ, అసలు సమస్యలు పరిష్కారం కావడం లేదు. దీంతో ఆలయాల అభివృద్ధికి కానుకల రూపంలో సమర్పిస్తున్న కోట్లాది రూపాయల సొమ్ము హారతి కర్పూరంలా కరిగిపోతోంది. అందుకు లెక్కా పక్కా కూడా సరిగా ఉండటం లేదు. ఆడిట్లో కూడా అనేక సందర్భాల్లో లెక్కల్లో తేడాలు బయటపడ్డాయి. అయినా అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవడం కానీ, రికవరీ చేసిన సందర్భాలు కానీ కనిపించడంలేదు. అందుకే దేవాలయాల పరిరక్షణకు ఆలయాల సొమ్ము భద్రతకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ తెరమీదకు వస్తుంది. ఆ దిశగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ అడుగులు వేయాలని భక్తులు కోరుకుంటున్నారు. ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవడానికి కమిషన్ తరహాలో చట్టభద్ధత కలిగిన నిర్ణయాలు తీసుకోవడానికి ఇదే సరైన సమయం అన్న అభిప్రాయం కూడా అందరిలో వ్యక్తమవుతుంది.

చర్చిలు, మసీదులు, సాయిబాబా ఆలయాల్లో కనిపించని సమస్యలు

రాష్ట్రంలోని చర్చిలు, మసీదులు, సాయిబాబా ఆలయాల్లో నిత్యం ప్రశాంతమైన వాతావరణం కనిపిస్తోంది. సమస్యలు కూడా పెద్దగా కనిపించవు. భక్తులకు ఇబ్బందికరమైన సమస్యలు తలెత్తకముందే నిర్వాహకులు వాటిని ముందే గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటుంటారు. ఫలితంగానే రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లోని ప్రముఖ చర్చిలు, మసీదులు, సాయిబాబా మందిరాల్లో అవినీతికి దూరంగా భక్తులు ప్రశాంత వాతావరణంలో భక్తి కార్యక్రమాలలో పాల్గొంటుంటారు. ఆ తరహా వాతావరణం చూద్దామన్న హిందూ దేవాలయాల్లో కనిపించడంలేదు. పుట్టపర్తి సాయిబాబా ఆలయం నడిచినంత ప్రశాంతంగా దేవాదాయ శాఖ పరిధిలోని ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో ఎందుకు వాతావరణం కనిపించడంలేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు.



కావాల్సిన సంపద ఉన్నా.. కనీస సౌకర్యాలు లేవు..

పలు ఆలయాలకు కావాల్సినంత సంపద ఉన్నా.. నిత్యం సమస్యలతోనే దైవ దర్శనాలను పూర్తి చేసుకోవాల్సి వస్తుందని భక్తులు నిలదీస్తున్నారు. ఆయా దేవుళ్లకు కోట్లాది రూపాయల ఆస్తులున్నా దేవాలయాలకు నిత్యం లక్షల్లో ఆదాయం వస్తున్నా భక్తులకు కనీస సౌకర్యాలను కూడా కల్పించలేక ఎండోమెంట్ అధికారులు, పాలకమండళ్లు, ఫెస్టివల్ కమిటీలు చేతులెత్తేస్తున్నాయి. బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక పూజలు, ప్రసాదాలు, టికెట్ల అమ్మకాలతో దేవాలయాలకు వస్తున్న ఆదాయం ఎవరి ఖాతాకు వెళ్తున్నాయో తెలియదు కాని కొన్ని దేవాలయాలలో సిబ్బందికి సకాలంలో జీతభత్యాలు కూడా ఇవ్వలేని పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మౌనం వహిస్తుండడంపై పలు సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కొంత మంది అధికారుల తీరుపై నిత్యం ఫిర్యాదులు అందుతున్న రాష్ట్ర స్థాయి అధికారులు వి. చారణ పేరుతో కాలయాపన చేస్తున్నారు. అవినీతి అధికారుల నుంచి పెద్ద ఎత్తున మామూలు తీసుకుంటూ పరోక్షంగా వారిని సమర్థిస్తున్నారు. దీంతో అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా దేవాదాయ శాఖ ఆలయాలు మారిపోతున్నాయి.

బ్రోకర్ల హడావిడి ఎక్కువ..

కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా కొంతమంది సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ప్రముఖ దేవాలయాలలో సుదీర్ఘకాలం తీప వేసి కూర్చున్న ద్వితీయ స్థాయి అధికారులు కొంతమంది బ్రోకర్లను ప్రోత్సహిస్తున్నారు. ఫలితంగా తరతరాలుగా ఆలయాలనే నమ్ముకుని ఆచారాన్ని పవిత్రంగా భావించే పూజారులు అడుగడుగునా అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే వేద మంత్రాలతో దేవుళ్లకు మేలుకొలుపు కార్యక్రమాలు, పల్లకి సేవలు, హారతి పూజలు వంటి కార్యక్రమాలతో నిత్యం దైవ సన్నిధిలోనే సేవలు చేసే పూజారుల కంటే బ్రోకర్ల హడావిడే ఎక్కువగా కనిపిస్తోంది. మరికొంతమంది దళారులతే అధికారుల అండ చూసుకుని ఏకంగా ఆలయాల నిర్వహణ బాధ్యతలను కూడా తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు. దీంతో పలు దేవాలయాల్లో అవినీతి అక్రమాలతో పాటు ధర్మ విరుద్ధ చర్యలు పెరిగిపోతున్నాయి. ఆర్థిక కుంభకోణాల సంఖ్య అంతకు రెండింతలు పెరుగుతూ వస్తుంది.

తిరుపతి లడ్డూ వ్యవహారంతో..

కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి లడ్డూలో.. కల్తీ నెయ్యి వ్యవహారంతో ప్రపంచవ్యాప్తంగా హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి. దీన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విచారణ చేపట్టాయి. ఒక్కో ఆలయానికి ఒక్కో విశిష్టత ఉంటుంది. అయితే.. కొంతమంది పాలకులు, అధికారులు వాటికి గండి కొడుతున్నారు. వారి అండదండలు చూసుకుని దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారులు కూడా ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రసాదాల్లో చోటు చేసుకుంటున్న ఆక్రమాలు, అందుకు సంబంధించిన ముడి సరుకు కొనుగోళ్లలో జరుగుతున్న ఆక్రమాలను పూర్తి స్థాయిలో అరికట్టడానికి, అవినీతి కార్యకలాపాలకు చెక్ పెట్టాలన్నా అందుకు సర్వ రోగనివారిణిగా టాస్క్ ఫోర్స్ లేదా స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రత్యేక కమిషన్ ను ఏర్పాటు చేసి 24 గంటలు ఆలయాల్లో పర్యవేక్షణ జరిగేలా చూడాతనలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆ దిశగా ఆధ్యాత్మిక వేత్తల నుండి కూడా డిమాండ్ పెరుగుతుంది.

# చెన్నై ఎయిర్ షో సందర్శనలో ఐదుగురు మృతి

చెన్నై,తమిళనాడులోని మెరీనా బీచ్ రోడ్డులో ఆదివారం నిర్వహించిన వైమానిక దళ ఎయిర్ షోలో చోటుచేసుకున్న విషాదంలో ఐదుగురు మృతి చెందారు. దాంతో డీఎంకే ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొక్కిసలాట, నిర్వహణలోపం వల్ల ఈ పరిస్థితి తలెత్తలేదని రాష్ట్ర ప్రభుత్వం ఆ విమర్శలకు బదులిచ్చింది. అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిన చాలామంది డిశ్చార్జి అయ్యారని, రాజీవ్‌గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరి పరిస్థితి నిలకడగా ఉందని డీఎంకే నేత శరవణన్ అన్నాదురై వెల్లడించారు. భారీగా వైమానిక విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు విస్తృతంగా ప్రచారం జరిగింది. ఆదివారం సుమారు 15 లక్షల మంది వచ్చినట్లు రక్షణదళాలు ప్రకటించాయి. తీరం వెంబడి 14-15 కి.మీ. మేర జనాలు గుమిగూడారు. ప్రారంభ సమయానికే చాలా దారులు మూసుకుపోయాయి. కార్యక్రమం పూర్తవగానే ఎవరూ, ఎటూ వెళ్లలేని పరిస్థితి. బీచ్ రోడ్డులో నీటివసతి లేకపోవడం, ఎండ తీవ్రత పెరగడంతో బాధితుల సంఖ్య పెరిగింది. ట్రాఫిక్ ఇబ్బందులను తప్పించుకునేందుకు పలువురు సబర్బన్, మెట్రో రైళ్లను ఆశ్రయించగా.. ఆ స్టేషన్లలోనూ భారీగా తోపులాటలు చోటుచేసుకున్నాయి. దీనిపై అన్నాడీఎంకే, భాజపా తీవ్ర విమర్శలు గుప్పించాయి. సమన్వయలోపం, తగిన ఏర్పాట్లు లేకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని అన్నాడీఎంకే చీఫ్ పళనిస్వామి దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సహా కీలకనేతలు రాజీనామా చేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ ఈవెంట్‌ను తగినరీతిలో నిర్వహించాం. ఐదుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడానికి గల కారణాలను విచారిస్తున్నాం. షో సమయంలో అధిక ఉష్ణోగ్రతలు ఉన్నాయి. ప్రజలు ఎక్కువదూరం నడవాల్సి వచ్చింది. ఈ ఘటనను రాజకీయం చేసేందుకే డీఎంకే ప్రభుత్వాన్ని నిందిస్తుంది‘ అని శరవణన్ స్పందించారు. ఈవిషయమై డీఎంకే ఎంపీ కనిమొళి ఎక్స్ వేదికగా స్పందించారు. ఎయిర్ షో చూసేందుకు వచ్చి రద్దీ, అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఐదుగురు మృతి చెందారనే వార్తలు ఎంతగానో కలచివేశాయి. నిర్వహణ సాధ్యం కాని సమూహాలను నివారించాలని ఆమె వ్యాఖ్యానించారు.

# ప్రధాని మోడీతో చంద్రబాబు భేటీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తిరుమల లడ్డూ ప్రసాదాన్ని ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు అందజేశారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా దేశ రాజధానిలో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకుని ప్రధానితో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. పోలవరం మొదట విడత నిధులు, రాజధాని అమరావతికి ప్రపంచ బ్యాంకు ద్వారా అందించే రూ.15కోట్లపైనా ఇరువురు చర్చించారు. అలాగే విశాఖ స్టీల్ ఎ÷-లాంట్, విశాఖ రైల్వే జోన్ శంకుస్థాపన అంశాలనూ ప్రధాని దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లారు.

# నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ,దేశంలో ఇప్పుడంతా ధరల సీజన్ నడుస్తోంది. ఏ వస్తువైనా పెరగడమే తప్ప దిగిరావడం లేదు. ఇప్పుడు ఉల్లిపాయ, టమాటా మొదలు సిమెంట్ ధరలు కూడా పెరుగుతున్నాయి. కూరగాయలకేనా..మాకు లేదా అంటూ సిమెంట్ కంపెనీలు ధరలు పెంచేస్తున్నాయి. నిర్మాణ కార్యక్రమాలుపెరగడంతో, సిమెంట్‌కు డిమాండ్ పెరిగి, సిమెంట్ ధరలు కూడా పెరిగాయి. ఈ ఏడాది, నైరుతి రుతపవనాల వల్ల దేశవ్యాప్తంగా మంచి వర్షాలు కురిశాయి. చాలా ప్రాంతాలను వరదలు చుట్టుముట్టాయి. ఆ ప్రత్యక్ష ప్రభావం నిర్మాణ కార్యకలాపాలపై పడింది. సాధారణంగానే వర్షాకాలంలో నిర్మాణ పనులు నిదానంగా సాగుతాయి. ఈ ఏడాది నైరుతి సీజన్‌లో వర్షాలు ఎక్కువగా కురవడం వల్ల నిర్మాణాలు మరింత తగ్గి ..ఓ రకంగా చెప్పాలంటే ఆగిపోయాయి. ఇప్పుడు, మాన్‌సూన్ సీజన్ ముగియడంతో దేశంలో నిర్మాణ పనులు మళ్లీ ఊపందుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా నివాస గృహాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, అపార్ట్ మెంట్లు, రహదారులు, కర్మాగారాలు, ప్రభుత్వ ప్రాజెక్టులు వంటివి చురుగ్గా ప్రారంభమయ్యాయి. ఫలితంగా సిమెంట్‌కు డిమాండ్ బాగా పెరిగింది. డిమాండ్ పెరిగే సరికి, సిమెంట్ కంపెనీలు రేట్లను కూడా పెంచాయి. సిమెంట్ బస్తా ధర రూ. 10 నుంచి రూ. 30 వరకు పెరిగింది. పెరిగిన రేట్లు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. దీంతో, వ్యక్తిగత నివాసాల నిర్మాణం నుంచి భారీ ప్రాజెక్టుల వరకు నిర్మాణ వ్యయం పెరుగుతోంది. ఏ నిర్మాణంలోనైనా సిమెంట్‌ది కీలక పాత్ర. సిమెంటు ధర పెరగడంతో నిర్మాణ వ్యయం పెరిగే పరిస్థితి ప్రతి ఏటా కనిపిస్తోంది. వాస్తవానికి, వేసవి కాలంలో నిర్మాణ కార్యక్రమాలు పీక్ స్టేజ్‌లో జరుగుతుంటాయి. అయితే, ఈ సంవత్సరం వేసవిలో మన దేశంలో లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ప్రవర్తన నియమావళి అమల్లోకి రావడం, దేశవ్యాప్తంగా ఎన్నికల హడావిడి, ఆ తర్వాత వర్షాకాలం ప్రారంభం కావడంతో దేశంలో కొన్ని నెలలపాటు నిర్మాణ కార్యకలాపాలు మందగించాయి. నిర్మాణ కార్యకలాపాలు స్తబ్ధుగా మారడంతో సిమెంట్ డిమాండ్ కూడా తగ్గింది. ఇది సిమెంట్ రేట్లపై ప్రభావం చూపింది. ఫలితంగా ఈ ఏడాది ప్రథమార్థంలో సిమెంట్ బస్తా ధర పెంపును అన్ని కంపెనీలు వాయిదా వేశాయి. గత వారంలో, స్టాక్ మార్కెట్‌లో భారీ పతనంతో దాదాపు అన్ని సిమెంట్ కంపెనీలు దెబ్బతిన్నాయి. అన్ని సిమెంట్ షేర్లు శుక్రవారం నష్టాల్లో క్లోజ్ అయ్యాయి. మార్కెట్ పరిస్థితులను బట్టి ఆయా పెట్టుబడి సాధనాల్లో రాబడి మారుతుంటుంది. దీంతో సిమెంట్ ధరలు పెరిగాయి. స్టాక్ మార్కెట్లలో మళ్లీ సిమెంట్ కంపెనీల షేర్లు పెరుగుతున్నాయి.

# దమ్ముంటే జగన్ తనతో పోటీ పడాలి

కడప, వైకాపా అధ్యక్షుడు జగన్‌కు దమ్ముంటే జమ్మలమడుగులో తనపై పోటీ చేయాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సవాల్ విసిరారు. స్థానిక వైకాపా నాయకులు తనకు ఏమాత్రం సరితూగరని అన్నారు. వైకాపా నేతలు రామసుబ్బారెడ్డి, సుధీర్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. తెదేపా నేత భూపేష్‌రెడ్డితో కలిసి జమ్మలమడుగులో మెగా జాబ్ మేళాను ఆదినారాయణ రెడ్డి ప్రారంభించారు. సంక్రాంతి నాటికి రాజోలి జలాశయ నిర్మాణం, గండికోట ముంపు పరిహారం, టిడ్కో ఇళ్ల పంపిణీ చేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాలను స్థానిక వైకాపా నాయకులు కబ్జా చేశారని, దొంగ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని

# సమగ్ర సమాచారంతో హైడ్రా యాప్




హైదరాబాద్ : చెరువులకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు హైడ్రా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే నగరంలో చెరువుల పరిరక్షణపై లేక్ ప్రొటక్షన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు.చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల గుర్తించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, స్టేట్ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్, సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో సోమవారం హైడ్రా కమిషనర్ ,లేక్ ప్రొటక్షన్ కమిటీ ఛైర్మెన్ ఏవీ రంగనాథ్ సమీక్ష నిర్వహించారు.నగరంలో చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు, ప్రజావసరాలకు నిర్దేశించిన స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా.. నిరంతరం నిఘా పెట్టేందుకు హైడ్రా చర్యలు చేపట్టింది. ఆక్రమణలకు ఆస్కారం లేకుండా యాప్‌ను అందుబాటులోకి తీసుకు వస్తోంది హైడ్రా. ఎక్కడ ఆక్రమణలు జరుగుతున్నా యాప్ ద్వారా సమాచారం క్షణాల్లో హైడ్రాకు చేరేలా చర్యలు తీసుకుంటున్నారు.ఆక్రమణలకు గురైన చెరువులను పరిరక్షించడమే కాదు.. వాటికి పూర్వవైభవం తీసుకువచ్చే పనిలో హైడ్రా ఉంది. ఆక్రమణలు తొలగించిన చెరువుల్లో డెబ్రీస్‌ను పూర్తి స్థాయిలో తొలగించడం, మొదటి దశగా సున్నం చెరువు, అప్పాచెరువు, ఎర్రకుంట, కూకట్‌పల్లి నల్లచెరువుతో పనులు ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు.ఓఆర్ఆర్ పరిధిలో ఎన్ని చెరువులున్నాయి, ఎంత మేర ఆక్రమణలకు గురయ్యాయి లెక్కలు తేల్చాలంటూ అధికారులకు సూచించారు రంగనాథ్. చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు శాస్త్రీయ పద్ధతుల అనుసరించే అంశాలపై సమీక్ష నిర్వహించారు. గతంలో నిర్ధారించిన ఎఫ్‌టీఎల్ సరిగా లేని పక్షంలో వాటిని సవరించేందుకు చర్యలు చేపట్టనున్నారు.45 ఏళ్ల డేటా ఆధారంగా చెరువుల ఎఫ్‌టీఎల్, మాగ్జిమమ్ వాటర్ స్ప్రెడ్ ఏరియా గుర్తించనున్నారు. ఇందుకు ఎన్ఆర్ఎస్ఏ, స్టేట్ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్, ఇరిగేషన్ విభాగాల డేటాతో సరిపోల్చి నిర్ణయం తీసుకోనున్నారు. విలేజ్ మ్యాప్స్, భూ వినియోగం సర్వే నంబర్లతో సహా సమాచారం ఇచ్చే కాడాస్ట్రల్ మ్యాప్స్ , 45 ఏళ్లలో పూర్తి స్థాయిల చెరువు నీరు విస్తరించిన తీరుపై సమాచారం సేకరించనున్నారు.హిమాయత్ సాగర్‌తో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల గుర్తింపు ప్రారంభించి అదే విధానాన్ని అన్ని చెరువుల విషయంలో పాటించేందుకు చర్యలు చేపట్టనున్నారు. చెరువుల ఆక్రమణలపై 2018లో కాగ్ ఇచ్చిన నివేదిక పరిశీలించి, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా చెరువులను గుర్తించేందుకు కసరత్తు ప్రారంభించారు. చెరువుల పరిరక్షణపై ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలపైనా సమీక్ష నిర్వహిస్తున్నారు.

# సద్దుల బతుకమ్మ,దసరాలకు ప్రత్యేక బస్సులు

హైదరాబాద్,సద్దుల బతుకమ్మ, దసరా పండుగలకు ప్రయాణికులను క్షేమంగా సొంతూళ్లకు చేర్చేందుకు టీజీఎస్ఆర్టీసీకి సహకరించాలని పోలీస్, రవాణా శాఖల అధికారులను సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ కోరారు. గత దసరాతో పోల్చితే ఈ సారి మహాలక్ష్మి పథకం అమలు వల్ల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముందని, గతంలో మాదిరిగానే సహాయసహకారాలు అందించాలని ఆయన కోరారు. సరా ఆపరేషన్స్‌పై హైదరాబాద్ లోని బస్ భవన్ లో సోమవారం టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అధ్యక్షతన పోలీస్, రవాణా శాఖ అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. దసరాకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులు, రద్దీ ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి వారికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆర్టీసీ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. పండుగ సమయాల్లో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు టీజీఎస్ఆర్టీసీకి పోలీస్, రవాణా శాఖలు ఎంతగానో సహకరిస్తున్నాయని గుర్తు చేశారు. సంస్థ వృద్ధిలో పోలీస్, రవాణా శాఖల పాత్ర కూడా ఉందని అన్నారు. పండుగలకు రద్దీ ఎక్కువగా ఉందని వైట్ నంబర్ ప్లేట్ గల ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి.. ఇబ్బందులు పడొద్దని ప్రజలకు సూచించారు. టీజీఎస్ఆర్టీసీలో ఎంతో అనుభవం గల డ్రైవర్లు ఉన్నారని, వారు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తారని చెప్పారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణిస్తే తలెత్తే ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగలకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం చేసింది. ఈ పండుగలకు రాష్ట్రవ్యాప్తంగా 6304 ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఈ సారి మహాలక్ష్మి పథకం అమలు నేపథ్యంతో రద్దీ దృష్ట్యా గత ఏడాదితో పోల్చితే అదనంగా 600 స్పెషల్ సర్వీసులను తిప్పాలని నిర్ణయించింది. ఈ నెల 9 నుంచి 12 తేది వరకు అధిక రద్దీ ఉండే అవకాశముండటంతో.. ఆ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతోంది. హైదరాబాద్ లోని ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఎల్బీనగర్ ఆరాంఘర్, కూకట్ పల్లి, గచ్చిబౌలి, బోయిన్ పల్లి, జగద్గిరిగుట్ట, సుచిత్ర, ఐఎస్ సదన్, బొరబండ, శంషాబాద్ లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంప్ లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. ప్రతి రద్దీ ప్రాంతం వద్ద పర్యవేక్షణ అధికారులను నియమించాం. ప్రయాణికుల రద్దీని బట్టి వారు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచుతారు. ప్రయాణికులకు సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా వలంటీర్లనూ నియమించాం.' అని



టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అన్నారు.ఐటీ కారిడార్ ఉద్యోగుల సౌకర్యార్థం గచ్చిబౌలి ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరు, తదితర ప్రాంతాలకు బస్సులను నడిపేలా ఎ÷-లాన్ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా జేబీఎస్ నుంచి 1602, ఎల్బీనగర్ నుంచి 1193, ఉప్పల్ నుంచి 585, ఆరాంఘర్ నుంచి 451 అదనపు బస్సులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. తిరుగు ప్రయాణం రద్దీ ఎక్కువగా ఉండే ఈ నెల 13, 14 వ తేదిల్లోనూ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. బతుకమ్మ, దసరా ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్ ను సంస్థ అధికారిక వెబ్ సైట్ బిజబసబిఇశిబీబ.తిని లో చేసుకోవాలని కోరారు. దసరా స్పెషల్ సర్వీసులకు సంబంధించి పూర్తి సమాచారం కోసం టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు. ప్రయాణికులు సమయాన్ని వృథా చేసుకోకుండా బస్సుల కదలికలను గుర్తించేందకు గమ్యం ట్రాకింగ్ యాప్ ను వినియోగించుకోవాలన్నారు. హైదరాబాద్ సిటీ అదనపు కమిషనర్(ట్రాఫిక్) విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. పండుగ వేళల్లో టీజీఎస్ఆర్టీసీకి తమ సహకారం ఎప్పటికీ ఉంటుందని అన్నారు. ప్రయాణికులను క్షేమంగా సొంతూళ్లకు చేర్చడానికి టీజీఎస్ఆర్టీసీతో సమన్వయంగా పని చేస్తామని చెప్పారు. సమన్వయ సమావేశంలో సైబరాబాద్ జాయింట్ సీపీ(ట్రాఫిక్) జోయల్ డేవిస్, హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీలు రాహుల్ హెగ్డే, అశోక్ కుమార్, రాచకొండ ట్రాఫిక్ డీసీపీలు శ్రీనివాసులు, మనోహర్, ట్రాఫిక్ అదనపు డీసీపీలు వీరన్న, ఎండీ మాజిద్, రవాణా శాఖలకు చెందిన ఆర్టీఏలు వాణి, పురుషోత్తం రెడ్డి, సుభాష్ సి రెడ్డితో పాటు టీజీఎస్ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) డాక్టర్ వి.రవిందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వినోద్ కుమార్, రంగారెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్ ఆర్ఎంలు శ్రీలత, వరప్రసాద్, కేఎస్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# ఫోర్త్ రిచెస్ట్ రైల్వే స్టేషన్...

న్యూఢిల్లీ : ప్రతి ఏటా రైల్వేస్టేషన్ల ఆదాయాన్ని రైల్వేశాఖ ప్రకటిస్తుంది. 2023%-%24 ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ ఆదాయం పొందిన వంద రైల్వే స్టేషన్లలో న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ ఫస్ట్ ప్లేస్‌లో ఉంది. పశ్చిమ బెంగాల్లోని హౌరా స్టేషన్ కు రెండో స్థానం దక్కింది. చెన్నైలోని ఎంజీఆర్ సెంట్రల్ మూడో స్థానంలో ఉంది.దీంతో దేశంలో నాలుగో రిచెస్ట్ రైల్వే స్టేషన్‌గా సికింద్రాబాద్ గుర్తింపు పొందింది.

ఆదాయం ఇలా ఉంది

ఢిల్లీ రైల్వే స్టేషన్ నుంచి ఏటా భారతీయ రైల్వేకు రూ.3,337 కోట్ల ఆదాయం వస్తోంది. హౌరా రైల్వే స్టేషన్ కు రూ.1,692 కోట్ల వార్షిక ఆదాయం రాగా చెన్నై సెంట్రల్ రూ.1,299 కోట్లు వచ్చాయి. తెలంగాణలో ఉన్న సికింద్రాబాద్ స్టేషన్ రూ. 1,276 కోట్లు సంపాదించి నాలుగో స్థానంలో ఉంది.

అలాగే 500 కోట్ల కంటే ఎక్కువ ఆదాయం వస్తున్న రైల్వే స్లేషన్లు నాన్ సబర్బన్ గ్రూప్ 1 కేటగిరీ కింద చేర్చారు. ఈ జాబితాలో 28 రైల్వే స్టేషన్లు స్థానం దక్కించుకున్నాయి. ప్రయాణికుల సంఖ్య పరంగా థానే (మహారాష్ట్రప్రయాణికుల సంఖ్య పరంగా పరిశీలిస్తే ముంబైలోని థానే రైల్వే స్టేషన్ అగ్రస్థానంలో నిలిచింది. 2023%-%24 ఆర్థిక సంవత్సరంలో 93.06 కోట్ల మంది ప్రయాణికులు ఈ స్టేషన్ నుంచి ప్రయాణించారు. ముంబైలోని కల్యాణ్ రైల్వే స్టేషన్ రెండో స్థానంలో ఉంది. ఈ ఏడు ఇక్కడి నుంచి 83.79 కోట్ల మంది ప్రయాణం చేస్తున్నారు.న్యూఢిల్లీలోని రైల్వే స్టేషన్ నుంచి 39.36 కోట్ల మంది ప్రయాణిస్తున్నారు. అలాగే సికింద్రాబాద్ కూడా ఈ జాబితాలో చోటు సాధించింది. దక్షిణ మధ్య రైల్వేలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ తరువాత ఎన్ఎస్‌జీ 1 హెూదా విజయవాడ (ఆంధ్రప్రదేశ్) మాత్రమే సాధించింది.ఈ గుర్తింపుతో కేంద్రం ఈ స్టేషన్లకు మరిన్ని నిధులు



కేటాయించనుంది. అలాగే.. ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నట్లు రైల్వే అధికారి తెలిపారు..2023-24 లో రైల్వేశా ప్రకటించిన ఆదాయం వివరాలున్యూఢిల్లీ . రూ. 3,337 కోట్లు హౌరా ( వెస్ట్ బెంగాల్) రూ. 1,692 కోట్లు. చెన్నై సెంట్రల్(తమిళనాడు)రూ. 1,299కోట్లు, సికింద్రాబాద్( తెలంగాణ)..రూ. 1,276 కోట్లు, హజరత్ నిజాముద్దీన్( ఢిల్లీ).. రూ. 1,227 కోట్లు. లోకమాన్య తిలక్ టెర్నినల్(ముంబై).. రూ. 1,036 కోట్లు. అహ్మదాబాద్ ( గుజరాత్) ..రూ. 1,010 కోట్లు, ముంబై సీఎస్టీ (మహారాష్ట్ర) ..రూ. 982 కోట్లుప్రయాణికుల పరంగా న్యూఢిల్లీ . 39,362, 272 మంది హౌరా ( వెస్ట్ బెంగాల్) 61,329,319 మంది చెన్నై సెంట్రల్(తమిళనాడు)30,599,837 మంది. సికింద్రాబాద్( తెలంగాణ). 27,776,937 మంది హజరత్ నిజాముద్దీన్( ఢిల్లీ).. 14,537,686 మంది లోకమాన్య తిలక్ టెర్నినల్(ముంబై)..14,680,379 మంది, అహ్మదాబాద్ ( గుజరాత్) .. 18,260,021 మంది ముంబై సీఎస్టీ (మహారాష్ట్ర) ..51, 652,230 మంది

# మాల్దీవులకు ఎల్లవేళలా భారత్ అండ



న్యూఢిల్లీ, మాల్దీవులకు గతంలో మాదిరే భారత్ అండ ఉంటుందని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. అన్ని రంగాల్లో అండగా ఉంటామని అన్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ , మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. భేటీ అనంతరం ఇద్దరు నేతలు సంయుక్త ప్రకటన చేశారు. ఈసందర్భంగా మాల్దీవులతో భారత్‌కున్న చిరకాల స్నేహం గురించి మోదీ గుర్తు చేశారు. ద్వీప దేశానికి కష్టమొస్తే.. ఆదుకునే విషయంలో ముందుండే తొలి దేశం భారత్ అని పేర్కొన్నారు. దానిని నిర్ధరించేలా కొవిడ్ వ్యాక్సిన్ల సరఫరా, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సహాయం చేయడం గురించి ప్రస్తావించారు. మాల్దీవుల్లో రూపే కార్డుతో పేమెంట్ సేవలు ప్రారంభించి, తొలి లావాదేవీని మోదీ, ముయిజ్జు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ముందుగా ముయిజ్జు, మాల్దీవుల ప్రతినిధి బృందానికి నా ఆహ్వానం. మన బంధం శతాబ్దాల నాటిది. భారత్.. మాల్దీవులకు అతి దగ్గరి పొరుగు దేశం, సన్నిహిత మిత్ర దేశం. మా నైబర్‌హుడ్ పాలసీ, సాగర్ విజన్‌లో మాల్దీవులది కీలక స్థానం. ఈ దేశం కోసం స్పందించే దేశాల్లో భారత్ ఎల్లప్పుడూ ముందుంటుంది. ఒక పొరుగు దేశంగా ఎల్లప్పుడూ మా బాధ్యతలు పూర్తిగా నిర్వహించాం. మన సహకారానికి వ్యూహాత్మక దిశానిర్దేశర చేసేలా అడుగులు వేస్తున్నాం. మాల్దీవుల ప్రజల ప్రాధాన్యాలకు మేం ఎంతో విలువిస్తాం. ఈ క్రమంలోనే ట్రెజరీ బిల్లుల విషయంలో ఉపశమనం కల్పించాం. మీ అవసరాలకు అనుగుణంగా.. 400 మిలియన్ల డాలర్ల, 3 వేల కోట్ల రూపాయల కరెన్సీ స్వాప్ అగ్రిమెంట్‌పై సంతకం చేశాం అని మోదీ వెల్లడించారు. అలాగే ఒక ఎయిర్ పోర్టు ప్రారంభించామని, 700 హౌసింగ్ యూనిట్స్‌ను నిర్మించి ఇచ్చామని చెప్పారు. పోర్టు నిర్మాణానికి మద్దతు ఇవ్వాలనే ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు. అడ్డు, బెంగళూరులో దౌత్య కార్యాలయాల ఏర్పాటుపై ఈ ఇద్దరు నేతలు చర్చించారు. ఈసందర్భంగా ముయిజ్జు మాట్లాడుతూ.. తమ దేశంలో పెట్టబడులు పెంచేందుకు భారత్‌తో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. తమ టూరిజం మార్కెట్‌కు భారత్ అతిపెద్ద సోర్స్ వెల్లడించిన ఆయన.. భవిష్యత్తులో టూరిస్టుల సంఖ్య పెరుగుతుందనే ఆశాభావం వ్యక్తంచేశారు. వీరిద్దరూ దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భేటీ అయ్యారు.

## నేటి గరుడ సేవకు విస్తృతంగా ఏర్పాట్లు

తిరుమల,కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామివారి గరుడ సేవకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో శ్యామలరావు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8న మంగళవారం మలయప్పస్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. తిరుమల కొండపైకి ఎక్కువ వాహనాలు రావడానికి వీల్లేదని స్పష్టం చేశారు. గరుడ సేవకు ఏపీఎస్ఆర్టీసీ 400కిపైగా బస్సులు ఏర్పాటు చేసిందని.. 3 వేల ట్రిప్పులు నడిపేందుకు వీలుగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. గరుడ సేవకు సంబంధించి తిరుమలలో ఏర్పాట్లపై మడియాతో ఈవో మాట్లాడారు. గరుడ సేవకు వచ్చే భక్తుల భద్రతకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. 1200 మంది తితిదే విజిలెన్స్ సిబ్బంది విధుల్లో ఉంటారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పోలీసు విభాగం నుంచి 3,800 మంది విధుల్లో ఉన్నారు. వారిలో 1,500 మంది గరుడ సేవ కోసం పని చేస్తున్నారని వివరించారు. తిరుమలలోని ముఖ్యమైన కూడళ్లలో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేస్తాం.

# తెలంగాణ బీజేపీ లీడర్లపై జేపీ నడ్డా ఫైర్.. ఎందుకంటే..




హైదరాబాద్, తెలంగాణలో బీజేపీ మెంబర్‌షిప్ డ్రైవ్ మొదలుపెట్టింది. ఇప్పటికే 15 రోజులు డెడ్ లైన్ పెట్టిన డిల్లీ పెద్దలు.. ఈ 15 రోజుల్లో 50 లక్షల సభ్యత్వాలు నమోదు చేయించాలని టార్గెట్ పెట్టారు. దాంతో సమయం సరిపోదంటున్న నేతలు గడువు పొడిగించాలని అధిష్టానానికి అర్జీ పెట్టుకున్నారంట. దానికి తోడు మెంబర్‌షిప్ డ్రైవ్ చేయడానికి నేతల మధ్య పంచాయితీలు అడ్డువస్తున్నట్లు తెలుస్తుంది. ఆ క్రమంలో సభ్యత్వ నమోదు రాష్ట్ర బీజేపీకి బిగ్ టాస్క్‌గా మారినట్లు కనిపిస్తుంది.తెలంగాణలో పార్టీ బలోపేతం కోసం బీజేపీ నాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మెంబర్ షిప్ డ్రైవ్ ఒక అడుగు ముందుకి.. నాలుగడుగులు వెనక్కి అన్నట్టు నత్తనడకన సాగుతోంది. దాంతో డిల్లీ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు చెప్తున్నారు. ఇటీవల పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా రాష్?ట్ర పర్యటన సందర్భంగా టార్గెట్ పూర్తి చేయకపోవడంపై నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారంట. 15 రోజులు డెడ్ లైన్ పెట్టి.. 50 లక్షల సభ్యత్వాలు నమోదు చేయించాలని ఆదేశించారంట.అయితే అంత తక్కువ టైంలో అంత పెద్ద లక్ష్యాన్ని చేరుకోవడం ఎలా అనే డైలమాలో రాష్ట్ర నాయకత్వం పడింది. టార్గెట్ ను రీచ్ అవ్వడానికి ప్రతి గ్రామం, ప్రతి బస్తీ, ప్రతి ఇల్లు వదలకుండా సభ్యత్వాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అందుకోసం పార్టీలో ఉన్న అన్ని మోర్చాలు సభ్యత్వ నమోదుపై దృష్టి పెట్టాలని, మెంబర్షిప్ పెంచేందుకు తీవ్రంగా శ్రమించాలని రాష్ట్ర నేతలు పార్టీ శ్రేణులకు చెపుతున్నారంట.రాష్ట్రంలో బీజేపీ మెంబర్ షిప్ ప్రక్రియ సెప్టెంబర్ 8 నుంచి మొదలైంది. వాస్తవానికి సెప్టెంబర్ 2 నుంచి ఈ ప్రక్రియ మొదలవ్వాల్సి ఉన్నప్పటికి భారీ వర్షాల కారణంగా ఆలస్యమైంది. ఆ తర్వాత గణేశ్ నవరాత్రి ఉత్సవాల వల్ల సైతం మెంబర్ షిప్ డ్రైవ్ కు బ్రేక్ పడింది. దీంతో గత నెల 28న నడ్డా పర్యటన నాటికి దాదాపు 10 లక్షల సభ్యత్వాలను మాత్రమే చేపట్టినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈనేపథ్యంలో నేతలు గడువు పొడిగించాలని అదిష్టానాన్ని కోరగా నడ్డా 15 రోజులు పొడిగిస్తూ డెడ్ లైన్ విధించారు. కానీ అంత తక్కువ సమయంలో తెలంగాణకు ఇచ్చిన 50 లక్షల సభ్యత్వాలను పూర్తిచేయడం శ్రేణులకు సవాలే కాదు తలనొప్పిగా మారింది. 50 లక్షల్లో 10 లక్షలు పూర్తవ్వగా మరో 40 లక్షల సభ్యత్వాలు పార్టీ చేపట్టాల్సి ఉంది.బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తెలంగాణ బీజేపీ నేతలకు పెట్టిన డెడ్ లైన్ లో ఇప్పటికే వారం రోజులు గడిచిపోయాయి. దీంతో రాష్ట్ర నేతలు టెన్షన్ పడుతున్నారు.. స్టేట్ ప్రెసిడెంట్ కిషన్ రెడ్డి పార్టీ కార్యాక్రమాల్లో బిజీగా ఉంటూ సభ్యత్వనమోదుపై దృష్టి పెట్టడం లేదు. మరోవైపు రాష్ట్రంలో బతుకమ్మ సంబురాలు జరుగుతుండగా సభ్యత్వాలు ఎలా చేపట్టేదంటూ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నారు. 15 రోజులు డెడ్ లైన్ పెట్టిన నడ్డా.. ఈ గడువు అనంతరం మరోసారి రివ్యూ చేస్తానని నేతలకు చెప్పి వెళ్లారు. ఆ సమీక్షలో ఆయనకేం సమాధానం చెప్పాలో తెలియక రాష్ట్ర నాయకత్వం సతమతమవుతోంది. అందుకే రాష్ట్ర నాయకత్వం మరింత గడువు ఇవ్వాలని హైకమాండ్ కు రిక్వెస్ట్ చేసినట్లు తెలిసింది.ఇదిలా ఉండగా ఈనెల 15వ తేదీ వరకు తెలంగాణలోని అన్ని తండాలు, బస్తీల్లో సభ్యత్వ నమోదు క్యాంపులు ఏర్పాటుచేయాలని నేతలు నిర్ణయించారు. తండాలు, గూడేలు, బస్తీలు, గిరిజన ప్రాంతాల్లో కలిపి తెలంగాణ వ్యాప్తంగా కనీసం 500 మెంబర్ షిప్ డ్రైవ్ క్యాంపులు ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదు చేపట్టాలన్న నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఇక సభ్యత్వ నమోదు కార్యక్రమానికి నేతల మధ్య ఉన్న పంచాయితీలు కూడా కారణమవుతున్నా యనే చర్చ జరుగుతోంది. నేతల పంచాయితీల వల్ల ఎవరికి వారు అన్నట్లు వ్యవహరిస్తుండటంతో సభ్యత్వ నమోదు వెనబడటానికి కారణమవుతుందనే గుసగుసలు ఆ పార్టీ కార్యలయంలో వినిపిస్తున్నాయి. మరి నడ్డా చెప్పిన టైంలోపు రాష్ట్ర నేతలు ఏ మాత్రం మెంబర్‌షిప్‌లు జాయిన్ చేయిస్తారో చూడాలి.

## సబ్సిడీపై 2.27 కోట్ల చేపపిల్లల పంపిణీ

నిజామాబాద్,జిల్లాలోని 396 మత్స్యకార పారిశ్రామిక సంఘంలో సభ్యులుగా ఉన్న 24 వేల మంది ఉపాధి కోసం ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై 2.27 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేస్తోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు విడతలవారీగా చేప పిల్లలను చెరువుల్లో వదులుతారని వివరించారు. 35 నుంచి 40 ఎంఎం సైజులో కోటీ 35 లక్షల చేపపిల్లలు, 80 నుంచి 100 ఎంఎం సైజులో 91 లక్షల పిల్లలు ఉన్నాయని తెలిపారు. సోమవారం నుంచి చెరువుల్లో చేపపిల్లలను వదలడానికి ఆఫీసర్లు వస్తున్నందున సీడ్ చేపల సైజ్‌ను చూసుకోవాలని పేర్కొన్నారు.

# జగన్ పుంగనూరు పర్యటన రద్దు

చిత్తూరు, వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పుంగనూరు పర్యటన రద్దు చేసుకున్నట్లు మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడించారు.. చిన్నారి అశ్వియ అంజూమ్ హత్య నేపథ్యంలో.. ఈ నెల 9వ తేదీన అశ్వియ అంజూమ్ కుటుంబ సభ్యుల్ని పరామర్శించేందుకు పుంగనూరు పర్యటనకు వైఎస్ జగన్ సిద్ధమయ్యారు.. అయితే, జగన్ పర్యటన రద్దు చేసుకున్నట్టు పెద్దిరెడ్డి వెల్లడించారు. చిన్నారి మృతి అందరినీ కలచి వేసిందన్న ఆయన.. కర్నూలులో లాగా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే జగన్ పుంగనూరు రావాలనుకున్నారు.. అయితే, వైఎస్ జగన్ పర్యటన అనగానే హడావిడిగా ముగ్గురు మంత్రులు పుంగనూరులో పర్యటించారు.. పోలీసులు కూడా ముగ్గురు దోషులను అరెస్టు చూపించారని.. వారిని కఠినంగా శిక్షించాలని కోరుతున్నాం.. ఈ నేపథ్యంలోనే పుంగనూరు పర్యటనను వైఎస్ జగన్ రద్దు చేసుకున్నట్టు వెల్లడించారు.. ఇక, ఇదే శ్రద్ధ కర్నూలు ఘటన జరిగినప్పుడు చూపించి ఉంటే ఆ అమ్మాయి ఆచూకీ లభించేది అన్నారు పెద్దిరెడ్డి.. మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటిస్తే ఇక రాష్ట్రంలో చర్చ మొదలవుతుందని పుంగనూరు ఘటనపై ప్రభుత్వం వేగంగా స్పందించింది.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయి అని ఆరోపించారు.. రెడ్ బుక్ రాజ్యాంగం అంటూ ప్రభుత్వమే దాడులకు ప్రేరేపిస్తుంద న్నారు.. ఇవన్నీ పక్కన బెట్టి ప్రజలు సంక్షేమం అందిస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచ



ంద్రారెడ్డి. కాగా, చిత్తూరు జిల్లా పుంగనూరులో గత నెల 29వ తేదీన మైనర్ బాలిక అదృశ్యం కేసు కలకలం సృష్టించింది.. రెండు రోజుల పాటు బాలిక కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది.. చివరికి ఈ నెల 2న పుంగనూరులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో బాలిక మృతదేహం బయటపడింది. కానీ, పోలీసులు విచారణలో జాప్యం చేస్తూ వచ్చారని.. ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శలు వచ్చాయి.. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ పుంగనూరు పర్యటనకు సిద్ధం కావడం.. మరోవైపు.. నిందితులను అరెస్ట్ చేయడంతో తన పర్యటనను రద్దు చేసుకున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com